Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 10.03.2017, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 40 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com





• కాకిలెక్కల బాబుకి

## చుక్కలు చూపించిన జగన్

### విపక్ష నేత దాడికి బెంబేలెత్తిన అధికారపక్షం

ఉత్తరాన నదీ ప్రవాహం, ఈశాన్యంలో నీళ్ళు వంటి పక్కా వాస్తు చూసి చంద్రబాబు అమరావతి రాజధానిని ఎంపిక చేశారు. ఆయన వాస్తు పిచ్చికి పాత రాజధాని హైదరాబాద్‌లోనే కాదు, అమరావతిలోనూ కొన్ని కోట్లు ఖర్చు పెట్టాల్సి వచ్చింది. ఇన్ని కోట్లు ఖర్చు పెట్టి హైదరాబాద్‌లో సెక్రటేరియట్ భవనాలను, ఇంటిని వాస్తు ప్రకారం మార్పుచేయించుకున్నా అక్కడ కాలం కలిసి రాలేదు. అక్కడ ఓటు–నోటు కేసులో ఇరుక్కుని హైదరాబాద్‌ను వదిలి రావాల్సి వచ్చింది. ఇక్కడ తాత్కాలిక అసెంబ్లీ భవనాన్ని కట్టించుకున్నా, ఇక్కడా తొలి రెండురోజుల్లోనే ఎదురుదెబ్బలు తగిలాయి.

(మిగతా 11వ పేజీలో)

• మైండ్‌బ్లాక్...



## ఆనంకు 'హై' షాక్

➤ విఆర్ కళాశాల కమిటి రద్దు
➤ బ్రదర్స్ పదవులు గోవిందా...
➤ ఫలించిన పూర్వవిద్యార్థుల పోరాటం

వందేళ్ళకు పైగా చరిత్ర... లక్షలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత... ఒకే ప్రాంగణంలో ఆరో తరగతి నుండి న్యాయవాద విద్య, పీజీ కోర్సుల వరకు... అతి తక్కువ ఖర్చుతో చదువు పూర్తి చేసుకునే వేదిక... నెల్లూరులోని వి.ఆర్. విద్యాసంస్థలు... వాస్తవానికి వెంకటగిరి రాజా కళాశాల అని పేరు. కాని ఇప్పుడు జనాల దృష్టిలో మాత్రం వి.ఆర్ అంటే వివేకానందరెడ్డి విద్యాసంస్థలు అని.

వి.ఆర్ విద్యాసంస్థలను తామే నెలకొల్పినట్లు, ఆ విద్యా సంస్థల నిర్మాణానికి తమ స్థలాన్ని దానం చేసినట్లుగా... ఆ విద్యాసంస్థలపై దాదాపు 3 దశాబ్దాలుగా పెత్తనం చేస్తున్న ఆనం సోదరులకు హైకోర్టు షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చింది. వి.ఆర్ విద్యాసంస్థల కమిటీని రద్దు చేస్తూ ఈ నెల 6న హైకోర్టు తీర్పునిచ్చింది. అలాగే కమిటీ తీసుకున్న నిర్ణయాలు కూడా

(మిగతా 11వ పేజీలో)

## నెంబర్ గేమ్‌లో నెగ్గేదెవరు?



> పోటాపోటీగా శిబిరాల నిర్వహణ
> ఒక్కో ఓటరుకు లక్షల్లో ఎర
> ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్న బాబు, జగన్
> రహస్య బ్యాలెట్ కొంప ముంచుతుందేమోనని 'దేశం'లో అనుమానాలు



బేరాలు... రాయబారాలు... క్యాంపులో మందు కంపు... పెరుగుతున్న ఓటు రేటు... ఎత్తులు... పైఎత్తులు... పార్టీ అధినేతల స్వీయ పర్యవేక్షణ... వ్యూహాలు... ప్రతివ్యూహాలతో 'స్థానిక' ఓటర్లకు గాలాలు... మాకు రెండు చేపలు పడ్డాయంటే, మా వలలో మీవి నాలుగు చేపలు పడ్డాయంటూ పోటాపోటీగా సమావేశాలు... నిస్సిగ్గుగా పార్టీ ఫిరాయింపులకు ప్రోత్సాహం, పార్టీ కండువాలు మార్చినవారికి లక్షల్లో డబ్బు...

(మిగతా 11వ పేజీలో)



స్వర్గీయ శ్రీమతి ఆలూరు సుజాత
కోవూరు (మరణం : 10-03-2015)

## ద్వితీయ వర్ధంతి

మమతల మణిదీపం, మా ఇంటి దైవం **శ్రీమతి ఆలూరు సుజాత** గారు మాకు దూరమై రెండు సంవత్సరాలు గడిచాయి. వారు మాపై చూపిన ఆత్మీయానురాగాలు మేము ఎన్నటికీ మరువలేము. వారి జ్ఞాపకాలు మా హృదయాలలో పదిలంగా వుంటాయి. వారి ఆత్మకు శాంతిని కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తూ... ద్వితీయ వర్ధంతి సందర్భంగా వారిని స్మరించుకొంటున్నాము.

భర్త : ఆలూరు శ్రీనివాసులు రెడ్డి

కుమారులు - కోడళ్లు :
ఆలూరు ప్రదీప్‌రెడ్డి - సుష్మ
డా॥ ఆలూరు స్వరూప్ కుమార్ రెడ్డి - రూప
మనుమలు, మనుమరాండ్రు,

మరిది - చెల్లెలు:
ఆలూరు అనిల్‌కుమార్‌రెడ్డి - శోభన
కుమార్తె : డా॥ సుస్మిత - పిడతల భాస్కర్‌రెడ్డి
కుమారుడు : ఆలూరు శ్రీకాంత్‌రెడ్డి - సాహితి

వర్ష, క్రిష్ణశ్రిత, యువన్, అమన్, శియ, నేహ, నిత్య మరియు కుటుంబసభ్యులు

# 'దేశం'కు జేసీ బ్రదర్స్ బురద!





***ఈరోజు ఇంట్లో వున్న టీవీలు చేయలేని పని చేతిలో వున్న సెల్‌ఫోన్‌లు చేస్తున్నాయి. మీడియాకు పక్షపాతం ఉంటుందేమో... కాని సెల్‌ఫోన్‌లకు ఎవరైనా ఒకటే కదా... ఒక్క మాటలో చెప్పాలంటే ఈరోజు ఎలక్ట్రానిక్ మీడియా కన్నా సోషల్ మీడియానే శక్తివంతంగా మారిందంటే అతిశయోక్తి కాదేమో! సోషల్ మీడియాలో ఒక్కో వ్యక్తి తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి.ప్రభాకర్‌రెడ్డిని తిడుతున్న బూతులు చూస్తుంటే... చెవుల్లో దూది పెట్టుకోవాలనిపిస్తుంది. ఆయనను అంత చంఢాలంగా, అంత అసహ్యంగా తిడుతు న్నారు. ఆ బూతులు గాని ప్రభాకర్‌రెడ్డి విన్నా డంటే ఇక జన్మలో నోరు తెరచి మాట్లాడడేమో!***

కృష్ణాజిల్లాలో ఇటీవల దివాకర్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు బోల్తా పడిన ఘటనలో 11మంది ప్రయాణీకులు మృతిచెందడం, ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్ళడం, ఆసుపత్రిలో బాధితులను పరామర్శించడం, ఈ సందర్భంలో బస్సు డ్రైవర్‌కు పోస్టుమార్టం చేయకుండా అధికారపార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలైన జేసీ బ్రదర్స్‌కు చెందిన దివాకర్ ట్రావెల్స్ యాజమాన్యాన్ని కాపాడే ప్రయత్నం చేసిన అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడం తెలిసిందే! అధికారపార్టీ నాయకులకు చెందిన ట్రావెల్స్ కంపెనీ బస్సు కావడంతో ఈ ప్రమాద ఘటనను తొక్కిపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ 'సాక్షి' మీడియాలో కథనాలు వచ్చాయి. 'సాక్షి'లో కథనాలు వచ్చినంత మాత్రాన జేసీ బ్రదర్స్ కొంపలేమీ అంటుకుపోవు. దివాకర్ ట్రావెల్స్‌ను కాపాడడానికి ఎలాగూ చంద్రబాబు ఉన్నాడు. మరి జేసీ ప్రభాకర్‌రెడ్డి బాధ్యతాయుత శాసనసభ్యుని హోదాలో వుండి, సభ్యత, సంస్కారం మరచి అనంతపురం 'సాక్షి' కార్యాలయం ఎదుట టెంట్ వేసి ధర్నాకు దిగి జగన్‌ను వ్రాయలేని భాషలో తిట్టాడు. తాగుబోతులు కూడా ఇంత నీచంగా మాట్లాడరు. జేసీ ప్రభాకర్ తిట్లపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు రాజకీయాలకతీతంగా ఆగ్రహించారు. ఎక్కువుగా మహిళలే స్పందించి జేసీకి తమదైన భాషలో బుద్ధి చెబుతూ సోషల్ మీడియాలో ట్వీట్ చేశారు. ఇంకొందరు యువకులు, వై.యస్. అభిమానులైతే జేసీ బ్రదర్స్‌ను పచ్చిబూతులు తిడుతూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టింగ్‌లు ప్రతిఒక్కరి సెల్‌ఫోన్‌లలోనూ విన్యాసం చేస్తున్నాయి. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఒకటి అంటే... అతనిని లక్షలాది మంది తిడుతున్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంత దిగజారి విమర్శలు చేసినా జగన్ ఎంతో హూందాగా వ్యవహరించి ప్రజల మన్ననపొందారు. గజరాజు పోతుంటే కుక్కలు మొరగడం సహజమేనంటూ జేసీ సోదరుల స్థాయిని చెప్పకనే చెప్పాడు. అయితే మొత్తం ఎపిసోడ్‌లో బాధ్యత విస్మరించిన అధినేతగా చంద్రబాబు మిగిలిపోతాడు. ఎందుకంటే తన పార్టీ ఎమ్మెల్యే హద్దుమీరి ప్రవర్తించినా చంద్రబాబు అతనిని పిలిచి మందలించలేదు. ఇది సంస్కారవంతుల పని కాదని చెప్పలేదు. ఇలాంటివి ఇక ముందు జరిగితే సహించనని హెచ్చరించలేదు. రాజకీయాల కొక భాష, రాజకీయ నాయకులకొక పద్ధతి వుంటుంది. ఏ పార్టీ వారయినా సరే, ఎప్పుడు కూడా అది శృతిమించకూడదు. కాని, తన పార్టీ నాయకులు శృతిమించి ప్రవర్తిస్తున్నా చంద్రబాబు చోద్యం చూస్తున్నాడంటే, వారికి అంటుకుని వున్న బురదను తాను కూడా పూసుకోవడానికి సిద్ధపడినట్లేనా?

## చంద్రబాబూ... నీచ రాజకీయాలు మానుకో

**- తిరుపతి ఎంపి వరప్రసాద్‌రావు**

సీనియర్ రాజకీయ నాయకుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నీచరాజకీయాలు మానుకోవాలని తిరుపతి ఎంపి వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన సూళ్లూరుపేటలోని కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఒక పార్టీలో ఆ పార్టీ గుర్తుపై గెలిచిన ప్రతిపక్ష సభ్యులను పోలీసులతో కేసులు పెట్టించి, బెదిరించి టిడిపిలోకి చేర్చు కోవడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. చంద్రబాబునాయుడు 30ఏళ్ళ రాజకీయ జీవితమంతా క్రిమినల్ రాజకీయాలే చేసారన్నారు. జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎన్నిక సమయంలోనూ 20మంది జడ్పీటీసీ సభ్యులను ప్రలోభ పెట్టి టీడీపీలో చేర్చుకున్నారన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం మానుకోకపోతే భవిష్యత్తులో అదే పోలీసులు మిమ్మల్ని చీదరించుకునే పరిస్థితులు వస్తాయన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డి గెలుపు కోసం వైయస్సార్సీపీ శ్రేణులంతా కలిసికట్టుగా పని చేయాలని కోరారు.

## శ్రీసిటీని సందర్శించిన పంజాబ్ మంత్రి

పంజాబ్ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య పారిశ్రామిక శిక్షణా శాఖ మంత్రి మదన్‌మోహన్ మిట్టల్ బుధవారం శ్రీసిటిని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రికి శ్రీసిటి ఎండి రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి సెజ్ అభివృద్ధి గురించి వివరించారు. అనంతరం ఆయన రాక్‌వర్త్ పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసిటిలో పరిశ్రమల ఏర్పాటుతో పాటు నివాస వసతులు, విద్య, వైద్య, వినోద సదుపాయాలు ఉండటం బాగుందన్నారు. పంజాబ్‌లోనూ శ్రీసిటి తరహాలో మోడల్ సెజ్ ఏర్పాటు చేసేందుకు అధ్యయనం కోసం ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. మంత్రి వెంట పలువురు అధికారులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మల్లాలమ్మ జాతర

నెల్లూరు వేదాయపాళెం సమీపంలో వున్న కొత్తూరులోని గాదం రోశయ్యనగర్‌లో ఆదివారం ఎంతో భక్తిశ్రద్ధలతో గ్రామదేవత మల్లాలమ్మ జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. జిల్లాలోని మేదర కులస్తులు, మిత్రబృందాలు, మిత్రమండలి భక్తులంతా కలసి అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించి అంగరంగవైభవంగా జాతర నిర్వహించారు. ఈ జాతరకు పెద్దసంఖ్యలో భక్తజనం విచ్చేశారు. పొంగళ్ళు పెట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు.

**సింహపురి సమాచారం**

## 12న ఉచిత షుగర్ పరీక్షలు

నెల్లూరు నవాబుపేట ఎఫ్‌సిఐ కాలనీ సాయిబాబా గుడి ప్రాంగణంలో ఈ నెల 12వ తేదీ ఆదివారం సువేదిక ఆయుష్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద శిబిరం, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయుర్వేద డాక్టర్ టి.వి.యస్.కృష్ణ తెలిపారు. ఎఫ్‌సిఐ కాలనీలోని సాయిబాబా గుడి ట్రస్ట్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6.30 గంటల నుండి 8 గంటలలోగా పరగడుపున షుగర్ పరీక్ష చేయించుకోవాలని, అనంతరం ఉదయం9.30 గంటల నుండి 11.30 గంటలలోగా తిన్న తరువాత షుగర్ పరీక్ష చేయించుకోవాలన్నారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### షార్ డైరెక్టర్‌కు

## మధ్యప్రదేశ్ ప్రభుత్వం అవార్డు

నెల్లూరుజిల్లా సూళ్ళూరుపేట శ్రీహరికోట సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం డైరెక్టర్ కున్హికృష్ణన్‌కు మధ్యప్రదేశ్ ప్రభుత్వం విజయన్ ప్రతిభ సమ్మన్-2017 పురస్కారం అందించింది. సోమవారం రాత్రి భూపాల్‌లో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఈ అవార్డును కున్హికృష్ణన్‌కు అందజేశారు.

**• వీధికెక్కిన వర్గపోరు**

# భళా... తెలుగు మహిళ



ఆడోళ్ళు కడుపులో ఏదీ దాచుకోరు... ఆనందం వచ్చినా పట్టలేము, ఆగ్రహం వచ్చినా తట్టుకోలేము... ఏదీ ఆపుకోలేరు. వారిని చూసి జిల్లా తెలుగుదేశం మగనాయకులు సిగ్గుపడాలి. అవమానంతో తలదించుకోవాలి. జిల్లా తెలుగుదేశం నాయకుల్లో ఒకరంటే ఒకరికి పడదు. ఒకరి వెనుక ఒకరు గోతులు తవ్వుకుంటుంటారు. అయినా ఎదురెదురు పడితే ఆప్యాయంగా మాట్లాడుకుంటారు. కడుపుల్లో కత్తులు పెట్టుకుని కౌగిలించుకుంటారు. మేం మగనాయకులు మాదిరిగా కాదు... లోపల ఒకటి పెట్టుకుని బయట ఇంకోటి చేయలేం, ఏదైనా ఓపెన్ ఫైట్ అంటూ జిల్లా తెలుగు మహిళలు తమ సత్తా చూపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున నెల్లూరులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని తమ విభేదాలకు వేదికగా మలిచారు.

వివరాల్లోకి వెళితే.. జిల్లా తెలుగుదేశం పార్టీలో నాయకులకు మధ్య విభేదాలున్నట్లే నాయకురాళ్ళ మధ్య కూడా విభేదాలున్నాయి. అయితే నాయకుల మధ్య విభేదాలున్నా బయటపడలేరు. నాయకురాళ్ళు మాత్రం బయటపడ్డారు. 8వ తేదీ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ టి.అనూరాధ ఆధ్వర్యంలో టీడీపీ ఆఫీసులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. దీనికి మున్సిపల్ మంత్రి పి.నారాయణ అతిథిగా వచ్చి మాట్లాడిపోబోయారు. అంతలో జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు పొత్తూరు శైలజ, రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ డైరెక్టర్ మల్లి నిర్మలలు ఇంకొందరు మహిళలతో వచ్చారు. మంత్రి నారాయణ ముందే అనూరాధతో మల్లి నిర్మల, శైలజలు గొడవకు దిగారు. తమకు తెలియకుండా తమను పిలవకుండా పార్టీ ఆఫీసులో కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారంటూ నిలదీశారు. దీంతో అనూరాధ వైపు మహిళలు కూడా అరుపులకు లేచారు. మంత్రి వారికి సర్ధిచెప్పి అక్కడ నుండి జారుకున్నాడు. మంత్రి వెళ్ళాక ఇరువర్గాల మధ్య గొడవ ఇంకొంచెం ఎక్కువైంది. ఈ రచ్చ భరించలేక పార్టీ ఆఫీసు ఇన్‌ఛార్జి శీనయ్య మంత్రికి ఫోన్ ద్వారా విషయం చెప్పాడు. పార్టీ ఆఫీసు నుండి అందర్నీ పంపించేయమని మంత్రి చెప్పడంతో శీనయ్య అదే పని చేసాడు. మొత్తానికి కడుపులో కసిపెట్టుకుని పెదాలపై చిరునవ్వులు చిందించడానికి మేం నాయకులం కాదు... నాయకురాళ్ళం అని నిరూపించారు తెలుగు మహిళా నేతలు.

## కొండబిట్రగుంట ప్రసన్నుని బ్రహ్మోత్సవాలు

నెల్లూరుజిల్లా బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో వేంచేసియున్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ భక్తుల గోవింద నామస్మరణలతో ప్రధానార్చకుడు వేదగిరి వెంకట నరసింహాచార్యుల ఆధ్వర్యంలో సహచర అర్చకబృందంతో కలిసి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. అయిదు రోజుల పాటు జరిగే పంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాహన సేవలకు సర్వదేవతా పరివారాన్ని, అష్టదిక్పాలకులను ఆహ్వానిస్తూ ధ్వజస్థంభం వద్ద గరుడ ధ్వజాన్ని ఆరోహణ చేశారు. ధ్వజారోహణ అనంతరం స్వామి వారి ఆశీస్సులుగా అందించే కొడిముద్దలను మహిళలు భక్తితో స్వీకరించారు. పిల్లలు లేనివారు కొడిముద్దలు స్వీకరిస్తే మాతృత్వం సిద్ధిస్తుందనే నమ్మకంతో రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన నూతన దంపతులు, సంతానలేమితో బాధపడుతున్నవారు ప్రసాదాన్ని స్వీకరించి ఉపవాస దీక్ష విరమించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రసన్న వెంకటేశ్వరుడు దేవేరులతో కలిసి శేషవాహనంపై కొలువుదీరారు. స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. గురువారం ప్రసన్నుడికి హనుమంత సేవ జరిగింది. భక్తులు విశేషంగా పాల్గొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## ఆదర్శ మహిళలకు పురస్కారాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నేతాజీ ఫౌండేషన్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరు టౌన్‌హాలు వర్ధమాన సమాజంలో వివిధ రంగాల్లో కృషి చేస్తున్న మహిళలను ఆదర్శ మహిళా పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపి ప్రైవేట్ ఐటిఐ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వొమ్మిన నాగసతీష్‌బాబు పాల్గొని మాట్లాడుతూ మహిళల్ని సమాజంలో గౌరవించి, పూజించినప్పుడే అభివృద్ధిని సాధించగలమన్నారు. అనంతరం ప్రొద్దుటూరుకు చెందిన రచయిత్రి కోట దుర్గాభవాని, నెల్లూరుకు చెందిన కవయిత్రులు అనురాధా రామకృష్ణ, గాలి లలిత, స్టేజి ఆర్టిస్టు గంధం రాజేశ్వరిలను ఆదర్శ మహిళా పురస్కారాలతో సత్కరించారు. నలుబోలు బలరామయ్యనాయుడు, వల్లకవి వేంకట సుబ్బారావు, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీ మోహన్‌రాజు, పేరం సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాక్సుల్లో భవిష్యత్



తూర్పు రాయలసీమ పట్టభద్రులు మరియు ఉపాధ్యాయుల శాసనమండలి నియోజకవర్గాల ఎన్నికలు 9వతేదీ జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 8 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 6గంటలకు ముగిసింది. పట్టభద్రుల నియోజకవర్గం నుండి 13మంది, ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి 9మంది బరిలో నిలిచారు. మూడుజిల్లాలకు సంబంధించిన ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ ఉపాధ్యాయుల నియోజకవర్గం నుండి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన విఠపు బాలసుబ్రహ్మణ్యం, టీడీపీ మద్దతుదారుగా పోటీ చేసిన వాసుదేవనాయుడుల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. అలాగే పట్టభద్రుల నియోజకవర్గంలో పిడిఎఫ్ అభ్యర్థి యండపల్లి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. మొత్తం పట్టభద్రుల నియోజకవర్గంలో 64.95శాతం, ఉపాధ్యాయ నియోజకవర్గంలో 87.1శాతం పోలింగ్ నమోదైంది. నెల్లూరుజిల్లా వ్యాప్తంగా పట్టభద్రులకు 85 పోలింగ్ కేంద్రాలను, ఉపాధ్యాయులకు 48 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 1200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసారు. పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా 133 వెబ్‌కెమెరాలను అమర్చారు. ఈ వెబ్‌కెమెరాల ఏర్పాటుతో జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్న తీరును కలెక్టరేట్ నుండే పర్యవేక్షించారు.



కాగా, పోలింగ్ కేంద్రాల వద్ద అధికారపార్టీ తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల హడావిడి ఎక్కువుగా కనిపించింది. మండలి ఎన్నికలకు కూడా సార్వత్రిక ఎన్నికల కలరింగ్ తెచ్చారు. తెలుగుదేశం నాయకులు ప్రతి మండల నాయకులకు ఖర్చుల క్రింద 50వేలు, లక్ష లెక్కన ఇచ్చారు. ఉపాధ్యాయుల నియోజక వర్గంలో పోలింగ్ శాతం మెరుగ్గా వుంది. పట్టభద్రుల నియోజకవర్గంలో పోలింగ్ శాతం తక్కువుగా వుంది. పోల్ అయిన ఓట్లలో సగానికి పైగా 1వ ప్రాధాన్యత క్రమం ఓట్లు వచ్చిన వాళ్ళే విజేతలు. అయితే పట్టభద్రుల నియోజకవర్గంలో 13మంది అభ్యర్థుల మధ్య సగం ఓట్లు తెచ్చుకోవడం ఎవరికైనా కష్టమే కాబట్టి 2వ ప్రాధాన్యత ఓటు కూడా కీలకమయ్యే అవకాశముంది.

ఏదేమైనా పోలింగ్ ముగిసింది. అభ్యర్థుల జాతకం బ్యాలెట్ బాక్సుల్లోకి చేరింది. 20వ తేదీ బాక్సులను బద్దలు చేస్తే ఎవరి భవిష్యత్ ఏంటో తేలుతుంది.

## • ప్రశాంతంగా మండలి ఎన్నికలు



## నేత్రపర్వంగా.. శ్రీ రాజరాజేశ్వరి పుష్పయాగం



వివిధ ప్రాంతాలకు చెందిన అమ్మవారి భక్తులు ఎంతో భక్తితో తెచ్చిన సుమారు ఒకటిన్నర టన్నుల పుష్పాలతో, నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి సోమవారం రాత్రి పుష్పయాగ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. 18 రకాల సుగంధభరిత పుష్పాలతో అమ్మవారికి అత్యద్భుతంగా నిర్వహించిన ఈ పుష్పయాగం అపూర్వమైనదంటూ భక్తులు ప్రశంసించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి ఈ నెల 6వ తేది నాటికి 42 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అమ్మవారి ఆలయంలో ఈ విశేషసేవను నిర్వహించారు. పుష్పశోభితో కనువిందు చేసే వేదికపై అమ్మవారికి ఎంతో వేడుకగా జరిగిన ఈ పుష్పయాగాన్ని కన్నులారా తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధాన అర్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో, అర్చకులు కుప్పచ్చి సుబ్బారావుస్వామి, రఘురామమూర్తి, వేదపండితులు అవ్వారు రామకృష్ణశర్మ అవధాని తదితరులంతా కలసి అమ్మవారికి ఈ సందర్భంగా శాస్త్రోక్తంగా విశేషపూజలు నిర్వహించారు.

ఈ పుష్పయాగం కార్యక్రమానికి శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి సేవాసమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి-పద్మావతి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించగా, స్థానిక ప్రముఖులు, వేలసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తరించారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పలువురు కార్పొరేటర్లు, స్థానిక ప్రముఖులంతా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ఇ.ఓ కోదండరామిరెడ్డి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ పర్యవేక్షణలో ఈ వేడుక ఎంతో ఘనంగా.. నయనానందకరంగా జరిగింది.

## కిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స

నెల్లూరులోని కిమ్స్(బొల్లినేని) ఆసుపత్రిలో ఒక అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించడం ద్వారా ఒక వ్యక్తికి కాలు తీసేయాల్సిన ప్రమాదం నుండి గట్టెక్కించాడు ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సి.ఎస్.శ్రీనివాసరాజు. ఎంతో వ్యయంతో కూడుకున్న ఆపరేషన్‌ను ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో చేసి ఆ రోగికి స్వాంతన చేకూర్చారు. వివరాల్లోకి వెళితే కడపజిల్లా రాయచోటి పట్టణం బోస్‌నగర్‌కు చెందిన ఓతేకుంట మహబూబ్ బాషా(42) ఎంతో కాలంగా ఎడమకాలు నొప్పితో పాటు ఎడమకాలి పిక్కలు, నడుము కండరాలు బిగుసుకుపోయి విపరీతమైన నొప్పితో బాధపడుతుండేవాడు. వాటంతట అవే సర్దుకున్నాక గాని నొప్పి తగ్గేది కాదు. నొప్పి వచ్చినప్పుడు ఏ పనులూ చేయలేకపోయేవాడు. ఎంతమంది డాక్టర్ల వద్ద చూపించుకున్నా అతని వ్యాధిని కనిపెట్టలేకపోయారు. మహబూబ్ బాషా చివరకు బాధను తట్టుకోలేక నెల్లూరులోని కిమ్స్ ఆసుపత్రికొచ్చి చీఫ్‌కార్డియాలజిస్ట్ శ్రీనివాసరాజును సంప్రదించారు. రోగిని పరీక్షించిన డాక్టర్ అన్ని పరీక్షలు నిర్వహించి అతను పెరిఫెరల్ వాస్కులర్ డిసీజ్ అనే వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు.



ఎడమ చేయి తుంటి ఎడమభాగాం మరియు ఎడమ కాలికి రక్తం సరఫరా చేసే రక్తనాళాలలో కొవ్వు పేరుకుపోయి రక్తనాళాలు సన్నబడి, కండరాలకు రక్తం సరఫరా సరిగా జరగక కాళ్ళు చేతులు సరిగా పనిచేయడం లేదని నిర్ధారించారు. నిరుపేద అయిన ఆ రోగి పట్ల మానవత్వంతో ఆలోచించిన శ్రీనివాసరాజు ఎన్టీఆర్ వైద్యసేవ క్రింద మూడు విడతలుగా అతనికి 'పెరిఫెరల్ యాంజియోగ్రామ్' చేసి ఎడమకాలి రక్తనాళాల్లో రక్త సరఫరాకు వున్న అడ్డంకులను తొలగించారు. గతఏడాది నవంబర్ 11వ తేదీన యాంజియోగ్రామ్ చేసి అదే నెల 18వ తేదీన 12సెంటీమీటర్ల పొడవైన స్టంట్‌ను రక్తనాళాల్లో అమర్చారు. దీంతోపాటు రక్తసరఫరాలో ఏ ఇబ్బందులు లేకుండా ఉండడానికి ఎడమవైపు కామన్ ఇలియాక్ ఆర్టరీకి కూడా స్టంట్‌ను అమర్చారు. అలాగే ఈ నెల 7వ తేదీన ఎడమచేతికి రక్త సరఫరా చేసే లెఫ్ట్ సబ్‌క్లేవియన్ ఆర్టరీకి 8 సెంటీమీటర్ల పొడవైన స్టంట్‌ను అమర్చి రక్తసరఫరాను పునరుద్ధరించారు.

ఈ చికిత్స తర్వాత మహబూబ్‌బాషా పూర్తిగా కోలుకున్నాడు. ఒక వ్యక్తికి మూడు రక్తనాళాల్లో స్టంట్లను అమర్చి, ఆ అవయవాలను పనిచేసేలా చికిత్స అందించడం అద్భుతమైన విషయమని చెబుతూ ఈ శస్త్ర చికిత్సను విజయవంతం చేసిన డాక్టర్ శ్రీనివాసరాజు, డాక్టర్ సాహెబ్ పీర్, డాక్టర్ శ్రీకరసమీరనందన్‌లను ఆసుపత్రి ఇ.డి గిరినాయుడు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జె.రంగారావులు అభినందించారు.

## అయ్యప్పస్వామికి అ'ద్వితీయ'ంగా మహా కుంభాభిషేకం



నెల్లూరులోని వేదాయపాలెంలో కొలువైవున్న భక్తవరదుడు శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామివారికి ఈ నెల 10 నుంచి 15వ తేది వరకు ద్వితీయ మహాకుంభాభిషేక మహోత్సవాలు అద్వితీయంగా జరుగుతున్నాయి. నెల్లూరులోని ప్రముఖదాత, ఆధ్యాత్మికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి-ప్రశాంతి దంపతుల సహాయ సహకారాలతో ఎంతో వైభవంగా ఈ మహాకుంభాభిషేక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ వడకెడత్తు పెరుంబడప్పుమన కేశవన్ నంబూద్రిపాద్ తంత్రివారి ఆధ్వర్యంలో జరిగే ఈ విశేష వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తరిస్తున్నారు. 10వ తేదిన నిర్మాల్య దర్శనం, మహాగణపతి హోమంతో ప్రారంభమైన ఈ వేడుకలు అదేరోజున అత్తాళపూజ, హరవరాసనం పూజలతో ఘనంగా జరిగాయి. 15వ తేదివరకు జరిగే ఈ వేడుకలను ద్వితీయ కుంభాభిషేకం కమిటీ గౌరవాధ్యక్షులు గ్రోసు గోపాలయ్య, అధ్యక్ష కార్యదర్శులు గునపాటి వెంకటకృష్ణారెడ్డి, గూడల శేషగిరిరావు, కోశాధికారి పి.టి రంగరాజన్‌తో పాటు కమిటీ సభ్యులు బిరుదువోలు శ్రీకాంత్‌రెడ్డి, కుందా సూర్యనారాయణరెడ్డి, దేవళ్ళ శ్రీధర్‌రెడ్డి, గంటా రమణయ్యనాయుడు, గడ్డం రత్నయ్య తదితరుల పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి.



## 'ప్రభా'తం

**మార్చి 8**
**అంతర్జాతీయ మహిళా దినోత్సవం..**
**ఇది ఎంతో గొప్ప సందర్భం.**

# హక్కులకు టాటా... అవస్థల్లో వాటా

**మహిళలకు భద్రత కల్పిస్తామని, మహిళాభ్యున్నతికి కృషిచేస్తున్నామని పాలకులు, ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్నా ఆచరణలోకొచ్చేసరికి అన్నీ శూన్యహస్తాలు.. శుష్కవాగ్దానాలే. మమతల పందిరి వేసి, కుటుంబాల్లో ప్రేమాభిమానాలకు పాదులు వేసి, అటు సమాజాన్ని.. ఇటు కుటుంబవ్యవస్థను అనురాగమయం చేసే త్యాగమయి.. అనురాగమయి మహిళ. అలాంటి మహిళాలోకానికి ఎన్ని జన్మలెత్తినా మనం రుణం తీర్చుకోలేం. వారిని సగౌరవంగా ఆదరించినప్పుడే..మహిళా సాధికారత.**

మహిళాలోకానికి సాధికారత కల్పించాలన్నదే ఐక్యరాజ్యసమితి ప్రధాన లక్ష్యం. 2030 నాటికి అన్ని రంగాల్లో సమానత సాధించాలన్న ఐరాస ఆశయం ఎంతో గొప్పది. అయితే. మన దేశంలో మాత్రం ఆ పరిస్థితి ఏమాత్రం కనిపించకపోవడమే బాధాకరం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ళవుతున్నా స్త్రీలకు సమానత్వం కాదు కదా..కనీసం స్వేచ్ఛ కూడా లేదు. స్త్రీ విద్య కోసం, సమానహక్కుల కోసం..సమన్యాయం కోసం నేటికీ మహిళాలోకం అలుపెరుగని పోరాటం చేస్తూనే వుంది. మహిళా సాధికారతను సాధించడంలో మన పాలకులు, ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు నామమాత్రం. మహిళల జీవనం నిత్యం సమస్యలూ..సవాళ్ళతోనే ప్రారంభం.. దేశంలో రోజూ మహిళల పట్ల జరుగుతున్న అకృత్యాలకు అఘాయిత్యాలకు లెక్కే లేదు. అడుగడుగునా లైంగిక వేధింపులు, రకరకాల అవమానాలు.. అనుమానాలు, మహిళలపై దాడులు, హత్యలు, మానభంగాలు.. దౌష్ట్యాలకు అసలు అంతే వుండడం లేదు. ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు.. ఆస్తుల్లో వాటాలు.. అభివృద్ధి పథకాల్లో ప్రధాన భాగాలు.. ఇలా చెప్పేవన్నీ మాటల నీటిమూటలే తప్ప, ఆచరణలో ఆడవారికి దక్కే భాగ్యం అంతంత మాత్రమే. భద్రత లేని బతుకులతో, స్వేచ్ఛ లేని జీవితంతో ఎంతోమంది స్త్రీలు సమాజంలో నిత్యం నానా రకాల బాధలు పడుతూనే వున్నారు. చివరికి. కట్టుకున్న భర్తలే కాలయముళ్ళవుతున్న వైనాలు, అబల అని కూడా చూడకుండా, మహిళలపై ఘోరాలకు అంతూపొంతూ వుండడం లేదు. ఒక బిడ్డగా..ఒక అక్కగా..చెల్లిగా..ఇల్లాలిగా..తల్లిగా..స్త్రీ తన జీవిత దశల్లో ఆత్మీయతానురాగబంధాలను పెనవేస్తూ..ప్రేమైకభావంతో కుటుంబ వ్యవస్థను అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నా, కనీస కృతజ్ఞత కూడా లేని దురహంకారంతో, పురుషాధిక్యతతో మగవారు పెడుతున్న రకరకాల గృహహింసలకు కూడా అంతే వుండడం లేదు. కాస్తంత అభిమానంతో ప్రోత్సాహమిస్తే చాలు..అత్యద్భుతమైన ప్రతిభాపాటవాలతో రాణించగల ధీర నారీమణులు ఎందరో వున్నా...అడుగడుగునా వారి ప్రతిభకు అడ్డుకట్ట వేసే మగమహానుభావులకు మనదేశంలో కొదవే లేదు. మహిళలపై అకృత్యాల నివారణకు మహిళా చైతన్యమే సరైన సమాధానం. అయినా, మహిళా రిజర్వేషన్లంటారే కానీ..ఎక్కడున్నాయో అవి. అన్నీ ఆకాశపుష్పాలే!..మహిళాభ్యున్నతికి భలేభలే పథకాలంటారు.. ఏవీ.. అన్నీ నేతిబీరలే. 33 శాతం మహిళా రిజర్వేషన్లలో ఎస్సీఎస్టీ ఓబిసిలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌కు ప్రధానమైన రాజకీయపార్టీలు ఎలాంటి చొరవ తీసుకోకపోవడం వల్లనే కదా మహిళా బిల్లుకు నేటికీ మోక్షం లేకపోవడం?..మాటలకు చేతలకు పొంతనలేని చేష్టల వల్ల ఎవరికి ప్రయోజనం? మరోవైపు నానాటికీ వ్యాపారసంస్కృతి, పాశ్చాత్య ధోరణులు ప్రబలిపోతూ, అశ్లీల సంస్కృతి వీరవిహారం చేస్తోంది. ఆడపిల్లల బతుకులకు భద్రత కరువైపోయింది. మహిళలకు భద్రత కల్పిస్తామని, మహిళాభ్యున్నతికి అనేక పథకాలు ప్రవేశపెడుతున్నామని పాలకులు, ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్నా ఆచరణలోకొచ్చేసరికి అన్నీ శూన్యహస్తాలు..శుష్కవాగ్దానాలే. రాత్రనక పగలనక అటు కుటుంబానికి, ఇటు సమాజాభ్యున్నతికి అహరహం కృషిచేసే స్త్రీమూర్తులపై మగరాయుళ్ళ పెత్తనం పెరిగిపోతూనే వుంది. మమతల పందిరి వేసి, కుటుంబాల్లో ప్రేమాభిమానాలకు పాదులు వేసి, సమాజాన్ని.. కుటుంబ వ్యవస్థను అనురాగమయం చేసే త్యాగమయి.. మహిళ. అలాంటి మహిళాలోకానికి ఎన్ని జన్మలెత్తినా మనం రుణం తీర్చుకోలేం. అయినా వారి స్వేచ్ఛకు సంకెళ్ళు వేసి, వారి జీవితాన్ని బందిఖానాగా చేసి వికృతహాసం చేస్తున్నా..నేటికీ ఎందరో మహిళలు అన్నిటినీ మౌనంగానే భరిస్తూ.. తమ జీవితాలను ఆయా కుటుంబాల శ్రేయస్సుకే అర్పిస్తూ తమ గొప్పదనాన్ని చాటుకుంటూనే వున్నారు. 'స్త్రీమూర్తి' అనే అమృతమయమైన పదానికి సార్థకతను చేకూరుస్తూనే వున్నారు. మరోవైపు మహిళలకు సమానావకాశాలు కల్పించడంలో, మహిళాభ్యున్నతికి కృషిచేయడంలో మన ప్రభుత్వాలు ఇంకా సన్నాయినొక్కులు నొక్కుతూనే వున్నాయి. అనేకమంది మహిళామణులు ఎంతో ధైర్యసాహసాలతో, ప్రతిభా పాటవాలతో అనేక రంగాల్లో ముందుకు సాగుతున్నప్పటికీ, మహిళలకు ఆయా రంగాల్లో తగినంత అవకాశాలు కరువవుతూనే వున్నాయి. ముఖ్యంగా నిరుపేదలైన బాలికలు, మహిళలది నిత్యం జీవన పోరాటమే. కార్మికులు, వ్యవసాయ కూలీల పరిస్థితి మరెంతో దయనీయం. ఒకవైపు పేదరికం..మరోవైపు అనారోగ్యం..ఇంకోవైపు కుటుంబ బాధ్యతలు.. మహిళలోకానికి ఈ సమస్యల కొలిమినుంచి విముక్తి ఎప్పుడో?!..

ఏదేమైనా, అటు ప్రభుత్వాలు, పాలకులు..ఇటు కుటుంబసభ్యులు.. అందరూ కలసి మహిళల పట్ల సరైన అవగాహనతో వుండాలి. వారి అభ్యున్నతికి చేయూతనివ్వాలి. అందుకు ముందుగా మగవారు మారాలి...పురుషాధిక్య మనస్తత్వం మారాలి. మహిళల పట్ల సానుకూల దృక్పథం అలవరచుకోవాలి. మానవత్వంతో పరిమళిస్తూ.. మహిళలను సాటి మనుషులుగా.. మన తల్లిగా.. చెల్లిగా..ఆత్మీయులుగా.. మానవతామూర్తులుగా భావించి గౌరవించాలి..ఆదరించాలి. వారి అభ్యున్నతికి చిత్తశుద్ధితో బాటలు వేయాలి. అప్పుడే.. అటు మహిళా సాధికారతకైనా..ఇటు మహిళా దినోత్సవాలకైనా.. నిజమైన సార్థకత! ఆ దిశగా అడుగులు వేద్దాం...!

## పోలీసుల మానవత్వం

తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలైన వ్యక్తికి పోలీసులు దగ్గరుండి వైద్యచికిత్స చేయించి ప్రాణాలను కాపాడి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. గత నెల 20వ తేదీ రాత్రి నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి తలపై ఇద్దరు పాత నేరస్తులు మద్యం మత్తులో బండరాయితో మోదారు. తీవ్రగాయాలతో ఉన్న అతన్ని 2వనగర పోలీసులు వెంటనే జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి అతని ప్రాణాలను కాపాడారు. ఆపరేషన్ జరిగిన తర్వాత వారం పదిరోజుల నుంచి అన్నీ తామై పోలీసులు సేవలందించారు. అతను ఎవరు, తన ఊరు ఏదో ప్రస్తుతం బాధితుడు చెప్పుకోలేక పోతున్నాడు. అప్పుడప్పుడు స్పృహలోకి వస్తూ కాసేపు ఏదో సైగలు చేస్తూ తిరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోతున్నాడు. బాధితుడికి సపర్యలు చేసేందుకు రెండవనగర ఇన్స్‌పెక్టర్ రామకృష్ణారెడ్డి కానిస్టేబుల్ చంద్రను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

## షాపింగ్ కాంప్లెక్స్ సీజ్

నెల్లూరు చిన్నబజారు, గిడ్డంగివీధిలోని షాపింగ్ కాంప్లెక్స్‌ను, బంగారు అంగడిని ఆస్తిపన్ను బకాయిలు చెల్లించని కారణంగా కార్పొరేషన్ అధికారులు సోమవారం సీజ్ చేశారు. రెవెన్యూ అధికారులు రాజ్యలక్ష్మి, సమద్, ఆర్ఐలు కృపాకర్, పద్మ, కృష్ణంరాజు, చిన్నబాబు, ప్రవీణ్, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

## ఎస్సైల పరీక్షా ఫలితాలు

ఎస్సైల ఎంపికల్లో భాగంగా జరిగిన పరీక్షా ఫలితాలను సోమవారం ఏపి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మెన్ అతుల్‌సింగ్ విడుదల చేశారు. గత ఏడాది సెప్టెంబర్ 17వ తేదీన 707 సివిల్, ఏఆర్, ఆర్ఎస్ఐ, ఏపిఎస్‌పి, డిప్యూటి జైలర్లు, అసిస్టెంట్ మేట్రిన్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసివున్నారు. దేహ దారుఢ్య పరీక్షల్లో రాష్ట్ర వ్యాప్తంగా 34,295 మంది ప్రతిభ కనపరచి రాత పరీక్షకు అర్హత సాధించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 18, 19తేదీల్లో కర్నూలు, గుంటూరు, ఏలూరు, విశాఖపట్నంలోని పరీక్షా కేంద్రాల్లో రాతపరీక్ష రాసారు. తుది జాబితాను ఈ నెల 15వ తేదీన విడుదల చేస్తామని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మెన్ తెలిపారు.

## ఏటిఎంలో హస్త లాఘవం

**• రూ.3.28 లక్షల సొత్తు అపహరణ**

ఎగ్జిక్యూటివ్‌లు హస్తలాఘవం ప్రదర్శించి ఏటిఎం కేంద్రంలో రూ.3.28 లక్షల సొత్తును అపహరించారు. ఈమేరకు నెల్లూరు ఒకటవ నగర పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే నెల్లూరు పొదలకూరురోడ్డు లేక్‌వ్యూ కాలనీకి చెందిన స్వర్ణా వెంకటేశ్వర్లు సర్వీస్ వాల్యూ ఇండియా లిమిటెడ్ కంపెనీలో టీమ్ లీడర్‌గా పనిచేస్తున్నాడు. ఎగ్జిక్యూటివ్‌లుగా గంగాధర్, కుమార్, ఖలీద్‌అహ్మద్, బత్తయ్యలు పనిచేస్తున్నారు. వీరు వివిధ బ్యాంకుల ఏటిఎంలలో నగదు పెట్టేవారు. ఎటిఎం సెంటర్ల సీక్రెట్ కోడ్ వీరికి తెలుసు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి 16వ తేదీన వెంకటేశ్వర్లు, గంగాధర్‌లు నెల్లూరు నగరంలోని వెంకటరమణ హోటల్ సమీపం లోని ఐసిఐసిఐ ఏటిఎంలో రూ.35లక్షలు నగదు డిపాజిట్ చేసారు. ఇది జరిగిన కొద్దిరోజులకు టీం లీడర్ వెంకటేశ్వర్లుకు యాక్సిడెంట్ కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఎగ్జిక్యూటివ్‌లు ఏటిఎం కేంద్రంలోని మిషన్‌ను తెరచి అందులో నుంచి రూ.3.28 లక్షల నగదును అపహరించారు. ఇటీవల ఏటిఎం కేంద్రాన్ని తనిఖీ చేయగా ఈ విషయం బయటపడింది. దీంతో వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఒకటవ నగర సిఐ షేక్ అబ్దుల్ కరీం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అది నోరా? డ్రైనేజీనా?

తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి.ప్రభాకర్‌రెడ్డి అనంతపురం 'సాక్షి' కార్యాలయం ఎదుట ధర్నా చేస్తూ ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డిపై అసహ్యకరంగా మాట్లాడాడు. తాగుబోతు లెవల్లో బూతులు తిట్టాడు. అసలు ఇలాంటి చీప్ నాయకులను ఎమ్మెల్యేలుగా ఎన్నుకున్నందుకు ప్రజలే తల దించుకోవాల్సిన పరిస్థితి. దివాకర్ ట్రావెల్స్ పేరుతో జేసీ సోదరులు చేస్తున్న అక్రమ రవాణా వ్యాపారం ఎవరికీ తెలియంది కాదు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో రవాణాశాఖ కమిషనర్‌గా వుండిన రేమాండ్ పీటర్‌ను ఈ ప్రభాకర్‌రెడ్డి నీచాతినీచంగా తిట్టాడు. ఒక పర్మిట్‌తో నాలుగు బస్సులు తిప్పుకునే జేసీ బ్రదర్స్ అరాచకాలను ప్రశ్నిస్తే బండబూతులతో జవాబిస్తారు. చంద్రబాబు కూడా వాళ్ళకు వంత పాడుతున్నాడు. రేపు వాళ్ళ చేతిలో చంద్రబాబుకు కూడా ఈ తిట్లు తప్పవు. అనంతపురం జిల్లాలో మాకంటే పాలెగాళ్ళు లేరని జేసీ బ్రదర్స్ రెచ్చిపోతున్నారు. మరి పరిటాల రవి ఉన్నప్పుడు ఏమైందో వీరి పౌరుషం.

**కొంకాల శ్యాంప్రసాద్, జమ్మలమడుగు.**

## విలువలను కాపాడండి

వైకాపా నుండి తెలుగుదేశంలోకి వచ్చిన ఎమ్మెల్యేలకు కూడా తన మంత్రివర్గంలో స్థానం కల్పించాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఇలాంటి పనులు ప్రజాస్వామ్య వ్యవస్థకు పట్టిన రోగంలాంటివి. రేపు ఒక పార్టీ ద్వారా గెలిచిన ఎమ్మెల్యేలు మంత్రిపదవులు ఇస్తామంటే ఇంకో పార్టీలోకి పోతుంటారు. ఒక పార్టీ గుర్తుమీద గెలిచి ఇంకో పార్టీలోకి వెళ్ళిన ఎమ్మెల్యే సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలి. పదేళ్ళ పాటు ఎలాంటి ఎన్నికల్లో వాళ్ళు పోటీ చేయకుండా చేయాలి. పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం బిల్లును వెంటనే కేంద్రం అమలులోకి తేవాలి.

**పత్రి శశిధర్, నెల్లూరు.**

## ఇంతకంటే మంచి అభ్యర్థి లేడా?

నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా చంద్రబాబుకు వాకాటి నారాయణరెడ్డి కంటే మంచి అభ్యర్థి దొరకలేదా? బ్యాంకులకు 500 కోట్లు అప్పుండడమే ఆయనకు ప్రధాన అర్హత అయ్యిందా? లేక కాంగ్రెస్ నుండి వచ్చినందుకు బహుమతా? తెలుగుదేశంపార్టీని నమ్ముకున్నోళ్లు, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచినోళ్ళు ఏం పాపం చేశారు? ఆ టిక్కెట్ ఏదో వాళ్ళకే ఇచ్చి ఉండొచ్చు కదా! తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక ఒక్కరంటే ఒక్కరికన్నా నిఖార్సయిన తెలుగుదేశం కార్యకర్తకు న్యాయం జరిగిందా?

**గుంటా ఆంజనేయప్రసాద్, నెల్లూరు.**





# రాజకీయమా? రక్త సంబంధమా?

## • ఆనం ఇంట్లో కొత్త సినిమా

**నెల్లూరుజిల్లాలో బెజవాడ, మేకపాటి, సోమిరెడ్డి, నల్లపరెడ్డి, నేదురుమల్లి వంటి రాజకీయ కుటుంబాలున్నాయి. అన్ని కుటుంబాలలో కూడా పదవుల వద్దో, ఆస్తుల దగ్గరో మనస్పర్థలు, విభేదాలు వచ్చాయి. సొంత అన్నదమ్ములే విరోధులుగా మారారు. అయితే ఈ కుటుంబాలన్నింటితో పోలిస్తే ఆనం సోదరుల మధ్యే చాలా ఆలస్యంగా విభేదాలొచ్చాయనుకోవచ్చు.**

2014కు ముందు దాకా కూడా ఆనం సోదరులు నలుగురూ కలిసి మెలిసే వున్నారు. ఆనం వివేకానందరెడ్డి పెద్దరికాన్ని, పెత్తనాన్ని మిగతా ముగ్గురూ గౌరవిస్తూ వచ్చారు. రాజకీయాల్లో తమ అన్నలు ఆనం వివేకా, ఆనం రామనారాయణరెడ్డిలు ముందుకుపోతుంటే, వారి తమ్ముళ్ళయిన ఆనం జయకుమార్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డిలు సహకరిస్తూ వచ్చారు. వాళ్ళిద్దరూ ఎన్నికల్లో నిలబడితే వీళ్ళిద్దరూ తిండి తిప్పలు మాని పని చేశారు. ఆనం వివేకా ఒకసారి మున్సిపల్ ఛైర్మెన్‌గా మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసాడు. ఆనం రామనారాయణరెడ్డి అయితే 1983 నుండి 2014 వరకు గ్యాప్ లేకుండా 8సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశాడు. వీళ్ళిద్దరి కోసం తమ్ముళ్లిద్దరూ కష్టపడ్డారు. వివేకా అనేక సందర్భాల్లో... మా రాజకీయ వారసులు మా కొడుకులు కాదు... మా తమ్ముళ్లే, ఇంతకాలం మా కోసం వాళ్ళు పని చేశారు. రేపు వాళ్ళ కోసం మేము పని చేస్తాం అని చెబుతుండేవాడు. మరిప్పుడు తమ తమ్ముళ్ళ కోసం పనిచేయడానికి అన్నలు సిద్ధంగా వున్నారా? అలా పనిచేసే అవకాశం వచ్చింది, మరి ఉపయోగించుకుంటారా?

2014 ఎన్నికలకు ముందే మూడో సోదరుడు ఆనం జయకుమార్‌రెడ్డి తన అన్న వివేకాతో విభేదించి ఇంటినుండే కాదు, ఆనం రాజకీయ కూటమి నుండి కూడా బయటకువచ్చాడు. ఇప్పుడు తెలుగుదేశంలోనే ఆదాలతో కలిసి నడుస్తున్నాడు. 2014 ఎన్నికల తర్వాత ఆనం వివేకా, రామనారాయణరెడ్డిలు తెలుగుదేశంలో చేరిపోయారు. నాలుగో తమ్ముడు ఆనం విజయకుమార్‌రెడ్డికి తన అన్నలతో వ్యక్తిగత తగవులు, ఆస్తి వివాదాలు లేవు, కాకపోతే తెలుగుదేశంలో చేరడానికి అతని మనసు అంగీకరించలేదు. జిల్లా రాజకీయాలలో తమ కుటుంబానికి వై.యస్. ఎంత ప్రాధాన్యతనిచ్చాడో తెలిసిన మనిషి కాబట్టి తెలుగుదేశంలోకి పోలేక వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరాడు. ఈరోజు తెలుగుదేశం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ టిక్కెట్‌ను ఆనం సోదరులు కూడా ఆశించారు. కాని చంద్రబాబు నిరాకరించారు. అదే సమయంలో వైకాపా మాత్రం స్థానిక ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆనం విజయకుమార్‌రెడ్డికి సీటిచ్చి నిలబెట్టింది. ఆనం విజయకుమార్‌రెడ్డి ఇంతవరకు సర్పంచ్, సొసైటీ ఛైర్మెన్, ఎంపీటీసీ వంటి పదవుల వరకే వచ్చాడు. ఇప్పుడు పోటీ చేస్తున్నది ఎమ్మెల్యే స్థాయి పదవి, గెలిస్తే రాజకీయంగా అతనికొక ముందడుగు పడినట్లే. కసి పెట్టుకుని ఆయనను ఓడించాలనేంత శత్రుత్వమైతే మిగిలిన ముగ్గురు సోదరులకు లేదు. కాకాపోతే అతనికొచ్చిన మొదటి అవకాశం ఇది. మరి ఇటు చూస్తే మిగిలిన ముగ్గురు సోదరులు తెలుగుదేశంలో వున్నారు. రాజకీయమా? రక్తసంబంధమా? అనే ప్రశ్న ఇక్కడ పుట్టుకొస్తుంది. రాజకీయం ముందు రక్తసంబంధాలు బలాదూరే... మామను దించి అల్లుడు కుర్చీ ఎక్కిన చరిత్ర వున్న తెలుగుదేశంలో అయితే అనుబంధాలు, రక్త సంబంధాలకు స్థానమే లేదు. కాబట్టి తమ్ముడు తమ్ముడే... పేకాట పేకాటే అన్న నీతిని ఆచరించక తప్పదు. చంద్రబాబు ఆదేశాలను పాటిస్తే ముగ్గురు అన్నలు కూడా విజయకుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా గట్టిగా పని చేయక తప్పదు. అలాగని వీళ్ళు వ్యతిరేకంగా పనిచేస్తే ఆనం సోదరుల చరిత్రలో ఈ సంఘటన ఒక గుర్తుగా మిగిలిపోతుంది. మరి ముగ్గురు సోదరులు రాజకీయంలోనూ పేకాట సిద్ధాంతాన్నే అనుసరిస్తారో, ఏమూలన్నా రక్త సంబంధం కదిలిస్తే తమ్ముడి విజయం కోసం పరోక్షంగానైనా పని చేస్తారో త్వరలోనే తెలుతుంది.



# డబ్బు పెట్టాలి...

## • ఓటర్లా... సంతలో పశువులా?

ఓటర్ల మీదే! ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజలకు సంక్రమించిన వజ్రాయుధం లాంటి హక్కు ఓటు. దీనికి వెలకట్టలేము. ఐదేళ్లకోసారయినా బలిసిన నాయకులు పూరిగుడెసెల్లో వున్న బక్కచిక్కిన ప్రాణులను పలుకరించేది ఈ ఓటు హక్కు ఉండబట్టే! భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో పెద్ద పదవి ప్రధానమంత్రి. ఈ దేశంలోని ఓ మారుమూల కొండ ప్రాంతంలో వున్న నిరక్షరాస్యుడు సైతం ఆ పదవికి కావాల్సిన వ్యక్తిని ఎన్నుకోగలడు. ఎంతో శక్తివంతమైన ఓటు ఇప్పుడు మార్కెట్‌లో అమ్ముడుపోయే వస్తువైంది. మనం రాజకీయ నాయకులకు క్వార్టర్ బాటిల్‌కు, 500 రూపాయల నోటుకు ఓటును అమ్ముకుంటున్నామంటే దాని అర్థం... కేవలం మనం అమ్ముకుంటున్నది ఓటునే కాదు, మన హక్కులను, అధికారాన్ని కూడా! హామీ ఇచ్చిన నాయకులను నిలదీసే హక్కును కోల్పోతున్నాం. డబ్బులు తీసుకుని ఓటేసినోడివి... నువ్వేంట్రా నన్ను అడిగేది అని నాయకుడే ఎదురు ప్రశ్నించే పరిస్థితిని మనం సృష్టించుకుంటున్నాం. మన రాజకీయ నాయకులు చాలా తెలివిగా వ్యవహరిస్తున్నారు. ముందు ఓట్లకు నోట్లిచ్చి ఓటర్లను అవినీతిపరులను చేస్తున్నారు. ఐదేళ్లలో వీడు అవినీతికి పాల్పడేది ఆ ఒక్కసారే! కాని దీని సాకుతో లీడర్లు ఐదేళ్ళు మనల్ని దోచుకు తింటున్నారు. నాయకుల అవినీతిని మనం వేలెత్తి చూపే అవకాశం లేకుండా చేస్తున్నారు.

మనం ఒక్క విషయం ఆలోచిద్దాం... ప్రపంచంలో మనకంటే వెనుకబడిన దేశాలు చాలావున్నాయి. కొన్ని దేశాల్లో ప్రజలు ఇంకా ఆకలితో అలమటిస్తు న్నారు. ఆఫ్రికన్ దేశాలలో అయితే ఆహారం కొరతతో మనుషులు పీనుగుల్లా తయారవుతున్నారు. అలాంటి నిరుపేద దేశాలలో కూడా ఎన్నికలొస్తే ఓట్లమ్ముకునే సంస్కృతి లేదు. మరి మన దేశంలో మరీ ముఖ్యంగా మన ఆంధ్రప్రదేశ్‌లోనే ఎందుకీ దౌర్భాగ్యం... నాయకులు కొంటామంటే మనల్ని మనం అమ్ముకోవాల్నా? మన హక్కులను వదులుకోవాలన్నా? ఓటును అమ్ముకొనేవాళ్ళకంటే ఒళ్ళును అమ్ముకునే వేశ్యలే ఎంతో గొప్పోళ్ళు! ఓటును ఎప్పుడైతే మనం అమ్ముకోవడం ఆపుతామో, అప్పుడే లీడర్లు మన కళ్ళ ముందు కనపడ్డం కాదు, కాళ్ళ మీద పడతారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తాడంట... ఆయన డబ్బు పెడతాడా... కనీసం 15కోట్లన్నా పెట్టాలి... అంత ఉన్నాయా? డబ్బు పెడితేనే గెలుస్తాడు... ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలంటే డిపాజిట్ వేలల్లో ఉంటుందేగాని లక్షల్లో ఉండదు... మరి ఈ కోట్లు ఎందుకు? ఈ సంస్కృతి ఏమిటి? మనం దేశాన్ని ఎక్కడకు తీసుకెళుతున్నాం... 'ఎన్నికల్లో డబ్బు పెట్టాలి' అనే మాట వినడానికే నీచాతినీచంగా నికృష్టంగా ఉంటుంది. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలు... రేపు ఎమ్మెల్యే, ఎంపీల ఎన్నికలు... ఆ తర్వాత మున్సిపాల్టీలు, జడ్పీటీసీలు, పంచాయితీలు, కో-ఆపరేటివ్ సొసైటీలు... ఎన్నికలు ఏవైనా పోటీ చేయాలంటే 'డబ్బు పెట్టాలి' అనే మాట తారకమంత్రమైంది. ఎంపీగా పోటీ చేయాలంటే 50కోట్లు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు 15కోట్లు, మేయర్‌కు 10కోట్లు, మున్సిపల్ ఛైర్‌మెన్‌లకు ఐదుకోట్లు, జడ్పీటీసీకి కోటి, కార్పొరేటర్‌కు 50లక్షలు, కౌన్సిలర్‌కు పాతిక లక్షలు, పంచాయితీల స్థాయిని బట్టి పాతిక లక్షల నుండి కోటి రూపాయలు... ఇదీ అభ్యర్థులకు ఫిక్స్ చేసిన ఖర్చు. దీనినిబట్టి ఏమర్థమవుతుందంటే చట్టసభలు, స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీలకు కొన్ని స్థానాలను రిజర్వ్‌డ్ చేసినట్లే రాజకీయాల్లో ఉండాలనుకున్న పేద నాయకులకు కూడా కొన్ని స్థానాలను రిజర్వ్ చేస్తే బాగుంటుందనిపిస్తోంది. రాబోయే కాలంలో డబ్బున్నోడికి తప్పితే సామాన్యుడికి రాకీయాల్లో నిలువనీడ ఉండదని తేటతెల్లమవుతోంది.

ఈ పరిస్థితికి కారణమెవరు? రాజకీయాల్లో నిలబడ్డవాళ్ళు ఇన్నేసి కోట్లు ఖర్చు పెట్టాల్సిన అవసరమేముంది? వీళ్ళు పెట్టే ఖర్చంతా కూడా



# వాకాటిపై... 'దేశం'లోనే వ్యతిరేకత

నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల తెలుగుదేశం అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డిపై సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రిస్టేజీ కోసం మంత్రి పి.నారాయణ, పార్టీ పట్ల బాధ్యత కాబట్టి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద సోదరులు, పార్టీ ఎమ్మెల్యేలు కాబట్టి కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావులు తప్పితే మిగతా నాయకులెవరికి వాకాటి అభ్యర్థిత్వం ఇష్టం లేదు. ఆయన గెలుపు కోసం మనస్ఫూర్తిగా పనిచేయలేకపోతున్నారు. కొందరైతే మొక్కుబడిగా చేస్తున్నారు. ముఖ్యంగా ఓటర్లుగా వున్న కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు కూడా వాకాటిపై అసంతృప్తితో వున్నారు.

సాధారణంగా నెల్లూరు జిల్లా నాయకులు అందర్నీ కలుపుకుని పోతుంటారు. చిన్నా, పెద్దా తేడా చూపరు. ఎంత పెద్దనాయకుడైనా సాధారణ కార్యకర్త భుజం మీద చెయ్యేసి మాట్లాడుతుంటారు. ఇలాంటి ఎన్నికల సమయంలో అయితే జిల్లా స్థాయి నాయకులకు ఎంపీటీసీలు, కౌన్సిలర్లు కూడా విఐపిలే! కాని ఎంపీటీసీలు, కౌన్సిలర్ల పట్ల వాకాటి కనీసం ఆ పాటి మర్యాద కూడా చూపడం లేదని తెలుస్తోంది. నామినేషన్‌కు ముందే ఆయన ఎంపీటీసీలనుద్దేశించి... వాళ్ళంతా ఎక్కడికిపోతారు, తాళ్ళతో కట్టేసయినా క్యాంపులకు తీసుకుపోమా అని ఒక సందర్భంలో వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. అలాగే మొన్న ఒకరోజు నెల్లూరులోని ఎమ్మెల్సీ సోమిరెడ్డి ఆఫీసుకు వాకాటి నారాయణరెడ్డి వచ్చాడు. టి.పి.గూడూరు మండలం పేదూరు ఎంపీటీసీ క్యాంపుకు పోలేదని, రేపోమాపో వస్తానంటున్నాడని ఒక వ్యక్తి సోమిరెడ్డికి చెప్పాడు. సోమిరెడ్డి వచ్చిన వ్యక్తికి ఏదో చెప్పేలోపే... అతని జేబులో ఒక క్వార్టర్ సీసా పెట్టండి, దొంగసారాయి అమ్ముతున్నాడని కేసు పెట్టిస్తే కుక్కినపేనులా క్యాంప్‌కు వస్తాడని వాకాటి నోరు పారేసుకున్నట్లు సమాచారం. వాకాటి నోట ఆ మాట విని అక్కడున్న తెలుగుదేశం నాయకులు కూడా అవాక్కయ్యారు. ఎంపీటీసీలను, కౌన్సిలర్లను ఇంత చీప్‌గా చూస్తున్న వాకాటికి టిక్కెటివ్వడం పట్ల తెలుగుదేశంలోనే తీవ్ర ఆగ్రహం వ్యక్త మవుతోంది.

# కోడ్ గోడను దూకిన మంత్రి



ఆయన మున్సిపల్ మంత్రి. ఆ పదవి శాశ్వతం. ఆ పదవిలో ఆయన శాశ్వతం కాదు. ఈరోజు ఆయన... ఆ కుర్చీలో రేపు ఇంకొకాయన... కాబట్టి ఆ శాఖలో పనిచేసే ఉద్యోగులు ఎవరి సొంత సొత్తూ కాదు. ప్రస్తుత మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ మాత్రం మున్సిపల్ స్కూళ్లలో పనిచేసే టీచర్లకు తమ నారాయణ విద్యాసంస్థల నుండి జీతాలు ఇస్తున్నట్లుగా ఫీలయ్యాడో ఏమో... వారందరినీ ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం అభ్యర్థులకు ఓట్లు వేయాలంటూ కోరాడు. అధికారిక పదవులను ఎన్నికల ప్రచారానికి వాడుకోకూడదన్న నిబంధన వున్నా ఆయన ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు.

మంత్రి కొంతమంది ఉపాధ్యాయులతో జరిపిన సెల్ కాన్ఫరెన్స్‌లో ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని మున్సిపల్ టీచర్లందరూ తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గాల్లో తెలుగు అభ్యర్థులకు ఓట్లేయాలని కోరారు. దీనిపై సిఐటియు, ఐఎన్‌టియుసి నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎన్నికల సంఘం విచారణ జరపాల్సిందిగా నెల్లూరు, ప్రకాశం, చిత్తూరుజిల్లాల జాయింట్ కలెక్టర్లకు ఆదేశించింది.

# అపోలోలో మహిళా దినోత్సవం

ఈ నెల 8వ తేదీన నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మాజీమేయర్ శ్రీమతి భానుశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొని సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మహిళలు ఇంకా ప్రగతి సాధించాలని పేర్కొన్నారు. మహిళలకు అవకాశం ఇస్తే అన్ని రంగాల్లోనూ రాణించగలరని చెప్పారు. డాక్టర్ హరిత మాట్లాడుతూ మహిళలు ఏ రంగంలో విజయం సాధించాలన్నా మానసికంగా, శారీరకంగా పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత కూడా పాల్గొన్నారు.

అలాగే అపోలో స్పెషాలిటీ ఆసుపత్రి నందు హైరిస్క్ ప్రెగ్నెన్సీ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ క్లినిక్‌లో 24గంటలు గర్భకోశ వ్యాధి నిపుణురాలు డాక్టర్ రోహిణి, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ రూపాలు సేవలందిస్తారని యూనిట్ హెడ్ నవీన్, మెడికల్



సూపరింటెండెంట్ డాక్టర్ శ్వేతలు తెలిపారు. డాక్టర్ రోహిణి మాట్లాడుతూ తమ వద్ద అత్యాధునిక పరికరాలతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చికిత్స చేయడం జరుగుతుందన్నారు. డాక్టర్ రూపా మాట్లాడుతూ హైరిస్క్ ప్రెగ్నెన్సీ వల్ల పుట్టే నెలలు తక్కువ, బరువుతక్కువ బిడ్డలకు, అధికబరువు, పురిటిలో ఇన్‌ఫెక్షన్ సోకిన బిడ్డలకు అత్యుత్తమ వైద్యం అందించి నయం చేస్తామన్నారు.

# నెల్లూరు కబుర్లు

## త్వరలో నెల్లూరుకు పవన్



జనసేన అధినేత, పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ త్వరలోనే నెల్లూరు రానున్నారు. జనసేన పార్టీని పటిష్టం చేసే చర్యల్లో భాగంగా ఆయన రాష్ట్రంలోని పలు నగరాల్లో సభలు నిర్వహిస్తుండడం తెలిసిందే! తదుపరి సభను రాజకీయ చైతన్యానికి వేదికైన నెల్లూరులో పెట్టాలనుకుంటున్నారు. అదీగాక ఆయనకు నెల్లూరుతో ప్రత్యేక అనుబంధముంది. ఆయన పుట్టి పెరిగి, తిరిగింది ఇక్కడే! కాబట్టి నెల్లూరులో పెట్టబోయే సభను చాలా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయాలనుకుంటున్నారు.

## బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ఈ నెల 7వ తేదీన నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఆరోజు సాయంత్రం ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, వేదపండితులు వేదమంత్రాలు, పూజలతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. విశ్వక్సేన పూజల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాథుడిని దేవస్థానం నుండి పురవీధుల్లో ఊరేగించారు. అలాగే బ్రహ్మోత్సవాలలో భాగంగా 8వ తేదీ ధ్వజారోహణ, శేషవాహనం, 9వ తేదీ సూర్యప్రభ, హంస వాహనోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ నెల 18వ తేదీతో రంగనాథుడి తిరునాళ్ళు ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాదిగా తరలివస్తున్న భక్తులతో, విద్యుత్ దీపాల కాంతులతో దేవస్థానం కళకళలాడుతోంది. ఆలయ ఛైర్మెన్ మంచికంటి సుధాకర్‌రావు, కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు తిరునాళ్ళను పర్యవేక్షిస్తున్నారు.

## నెల్లూరుజైల్లో ఐజి

జైళ్ళ శాఖ ఐజి సునీల్ 6వతేదీ నెల్లూరులో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. ఫైరింగ్ రేంజ్, ఇండోర్ స్టేడియం, ఇతర భవనాల పనులను పరిశీలించారు. నెల రోజుల్లో స్టేడియం నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్ర కారాగారాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ రవికిరణ్, ఏపి స్పోర్ట్స్ ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

## దళితుల డిమాండ్స్ నెరవేర్చాలి

దారిద్ర్య రేఖకు దిగువనున్న ఎస్సీ, ఎస్టీ, బి.సి, మైనార్టీలకు 'భూమి కొనుగోలు పథకం'ను అమలు చేసి నిరుపేదలకు రెండెకరాల భూమి, ఒక ఇంటి స్థలాన్ని మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రచార కార్యదర్శి అరవ పూర్ణప్రకాశ్ ఒక వినతి పత్రంలో జిల్లా కలెక్టర్‌ను కోరారు. ప్రైవేట్ రంగంలో ఎస్సీ, ఎస్టీ, బి.సిలకు రిజర్వేషన్‌లు అమలు చేయాలి. అశాస్త్రీయంగా ఎస్సీ, ఎస్టీ, బి.సిల జాబితాలో ఇతర కులాలను చేర్చకూడదు. ఈ వర్గాల వారి హాస్టల్స్‌కు ప్రత్యేకనిధులు కేటాయించాలని ఆయన ఆ వినతిపత్రంలో కోరారు.

## ఎస్పీకి అభినందనలు తెలిపిన పోలీసు సంఘం



జిల్లా ఎస్పీగా పనిలో కుదిరి సంవత్సరం అయిన సందర్భంగా పోలీసు అధికారుల సంఘం నాయకులు 6వ తేదీ ఎస్పీ విశాల్‌గున్నీని ఆయన ఛాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాదిలో పోలీసు సిబ్బంది సమస్యల పట్ల ఎస్పీ ప్రత్యేకశ్రద్ధ పెట్టి పరిష్కరించారని, పోలీసు కుటుంబాలకు అండగా నిలిచారని, కష్టాల్లో వున్న పోలీసులను ఆదుకున్నారని ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు యం.ప్రసాదరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎం.గంగాధర్, ఎం.జి.ఆర్.శ్రీనివాసులురెడ్డి, తురకా శ్రీనివాసులు, రమణయ్య ఉన్నారు.

## చెస్ అసోసియేషన్ కో-ఆర్డినేటర్‌గా విజయ్‌కుమార్

నెల్లూరుజిల్లా చెస్ అసోసియేషన్ కో-ఆర్డినేటర్‌గా నర్రా విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నట్లు ఏపి చెస్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి సుమన్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, చెస్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

## ఉత్సాహంగా మైథిలి స్పోర్ట్స్ మీట్



నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 4వ తేదీ మైథిలి ఇంగ్లీష్‌మీడియం స్కూల్ స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా ప్రారంభమైంది. తొలుత జాతీయ పతాకాన్ని నెల్లూరు రూరల్ ఎంఇఓ జగదీష్ ఆవిష్కరించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించారు. విద్యార్థుల కవాతు క్రీడా ప్రతిజ్ఞ ఆకట్టుకున్నాయి. క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. నెపస్మా అధ్యక్షుడు యం.వి.సుబ్బారెడ్డి, మైథిలి ఇంగ్లీషు మీడియం డైరెక్టర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాధాకృష్ణమూర్తి, పాఠశాల వ్యవస్థాపకుడు మైథిలి మనోహర్‌రెడ్డి, కరస్పాండెంట్ మైథిలి పాల్గొన్నారు.

## అరుదైన రికార్డులందుకున్న చంద్ర

- లక్ష తిరునామాలతో పద్మావతి సమేత వేంకటేశ్వరుని చిత్రం





ప్రముఖ చిత్రకారుడు తిరుమలశెట్టి చంద్ర రెండు అరుదైన రికార్డులు అందుకున్నారు. వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను ఆయా సంస్థల ప్రతినిధులు బింగి నరేంద్రగౌడ్, డాక్టర్ స్వర్ణశ్రీ ఆదివారం నెల్లూరు టౌన్‌హాలు వర్ధమాన సమాజంలో చంద్రకు అందజేశారు. లక్ష తిరునామాల పద్మావతి సమేత వేంకటేశ్వరుని చిత్రాన్ని రూపొందించినందుకుగాను ఆయనకు ఈ రికార్డులు లభించాయి. రత్నశ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో చిత్రపట ఆవిష్కరణ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా డా॥ స్వర్ణశ్రీ, నరేంద్రగౌడ్ మాట్లాడుతూ లక్ష నామాలతో ఎలాంటి గీతలు లేకుండా పద్మావతి వెంకటేశ్వరులను చిత్రించడం ప్రపంచంలోనే అరుదైన ప్రతిభగా గుర్తించామని, దీనిని చంద్ర సాధించడంతో నెల్లూరుకు కీర్తిప్రతిష్టలు లభించాయన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ చిత్రకారుడు చంద్ర ప్రయత్నం అద్భుతమని, మరెన్నో అద్భుత చిత్రాలను చిత్రించి సింహపురి కీర్తిని నలుదిశలా వ్యాపింపజేయాలని కోరారు. ఈ చిత్రపటాన్ని టిటిడి గుర్తించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం అన్నమయ్య ప్రాజెక్ట్ కళాకారుడు గుండాల గురవయ్యకు అభినవ అన్నమయ్య బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. మండే లక్ష్మీనరసింహారావు, వల్లకవి వేంకటసుబ్బారావు, కసుమూరు దర్గా ఫీర్ ఖాసింఫీర్, సూక్ష్మ చిత్రకారుడు డా॥ షేక్ ముసవ్వీర్, డా॥ రామిశెట్టి భరత్ తదితరులు పాల్గొన్నారు.

## గుండెజబ్బులపై వాకర్స్‌కు అవగాహన





నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వాకర్స్‌కు ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కార్డియోసర్జన్ చుండూరి కోదండపాణి రామానుజదాసుడు ఆధ్వర్యంలో గుండెజబ్బులపై ఆదివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కోదండపాణి మాట్లాడుతూ మిత ఆహారం, నిత్య వ్యాయామం గుండెకు ఎంతో శ్రేయస్కరమని వివరించారు. అనంతరం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు, పాలిటెక్నిక్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ లక్కాకుల శ్రీనివాసులు వాకర్స్‌కు మాస్క్‌లను పంపిణీ చేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వినుకొండ వెంకటేశ్వర్లు, దొడ్ల జయరామనాయుడు, సహాయకార్యదర్శి సాయిసుబ్బారావు, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 జిల్లా గవర్నర్ మైథిలి మనోహర్‌రెడ్డి, డిప్యూటీ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



# పంచాయితీలకు ప్రమోషన్!

జిల్లాలో ఇప్పటికే నెల్లూరు కార్పొరేషన్‌గా ఉండగా గూడూరు, కావలి, వెంకటగిరి, సూళ్లూరుపేట, ఆత్మకూరు, నాయుడుపేటలు మున్సిపాల్టీలుగా ఉన్నాయి. వై.యస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే సూళ్లూరుపేట, ఆత్మకూరు, నాయుడుపేట మేజర్ పంచాయితీలను మున్సిపాల్టీలుగా మార్చడం జరిగింది.

కాగా, జిల్లాలో మరో 9 మేజర్ పంచాయితీలను మున్సిపాల్టీలుగా మార్చడానికి అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈమేరకు అర్బనైజేషన్ క్రింద 9 పంచాయితీలను మున్సిపాల్టీలుగా మార్చడానికి తగిన నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించడం జరిగింది. మున్సిపాల్టీలుగా ప్రతిపాదించిన పంచాయితీలలో బుచ్చిరెడ్డిపాలెం, వింజమూరు, అల్లూరు, కోట, పొదలకూరు, రాపూరు, తడ, ముత్తుకూరు, ఉదయగిరి పంచాయితీలున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే బుచ్చిరెడ్డిపాలెంను మున్సిపాల్టీ చేయాలనే ప్రతిపాదన వచ్చింది. ఈ ఊరు బాగా విస్తరించింది. వ్యాపార పరంగా కూడా మంచి సెంటర్ అయ్యింది. ఇక వింజమూరు, పొదలకూరు, కోట, తడ గ్రామాలు ఇటీవలకాలంలో బాగా అభివృద్ధి చెందడమేకాక పట్టణాలుగా విస్తరించాయి కూడా! కృష్ణపట్నం పోర్టు మూలంగా ముత్తుకూరు ఒక పెద్ద వాణిజ్య కేంద్రంగా మారింది. ఇక దీనిని కూడా మున్సిపాల్టీని చేయడం తప్పనిసరి. అల్లూరును కూడా మున్సిపాల్టీని చేయాలనే ప్రతిపాదన వుంది. ఇక ఉదయగిరి, పొదలకూరు, రాపూరు మెట్ట ప్రాంతాలు. పట్టణీకరణలో భాగంగా వాటిని మున్సిపాల్టీలుగా మారిస్తే మరింతగా అభివృద్ధి చెందడానికి అవకాశముంటుంది. ఏది ఏమైనా ఈసారి స్థానిక ఎన్నికల నాటికి ఈ తొమ్మిది పంచాయితీలు కూడా మున్సిపాల్టీలుగా మారే అవకాశముంది. ఆ గ్రామాల్లో ఇంతకాలం వున్న సర్పంచ్‌లు పోయి మున్సిపల్ ఛైర్మెన్‌లు, వార్డు మెంబర్లు పోయి కౌన్సిలర్లు రావచ్చు.

# మహిమలూరు సతీష్‌రెడ్డికి విఐటి పురస్కారం

భారత రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు, డిఆర్‌డిఓ శాస్త్రవేత్త, నెల్లూరుజిల్లా, ఆత్మకూరు మండలం మహిమలూరు వాసి గండ్ర సతీష్‌రెడ్డి మరో ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. 6వ తేదీ హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో విఐటి వర్శిటీ వైస్‌ప్రెసిడెంట్ జి.వి.సెల్వం చేతులమీదుగా ఆయన విఐటి జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. రక్షణ రంగంలో దేశానికి అందిస్తున్న అత్యున్నత సేవలకు గాను సతీష్‌రెడ్డికి ఈ పురస్కారం అందించినట్లు విఐటి వర్శిటి వైస్‌ప్రెసిడెంట్ సెల్వం తెలిపారు.




## కోస్టుగార్డ్ నౌక రాకతో...

# కృష్ణపట్నం పోర్టుకు రక్షణ కవచం



ఈ నెల 6వ తేదీన కృష్ణపట్నం పోర్టుకు ఐసిజిఎస్ ఆయుష్ కోస్టుగార్డ్ నౌక వచ్చింది. ఈ నౌకకు పోర్టు యాజమాన్యం ఘనస్వాగతం పలికింది. కోస్టుగార్డ్ డిఐజి అనిల్ కుమార్ హర్బోలాతో పాటు రిటైర్డ్ డిఐజి శ్రీనివాసన్, నౌక కమాండింగ్ ఆఫీసర్ ఆశీష్‌శర్మ, స్థానిక కమాండింగ్ ఆఫీసర్ వేణుమాధవ్, పోర్టు పిఆర్ హెడ్ గంటా వేణుగోపాల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నౌక రాకతో కృష్ణపట్నం పోర్టు తీర భద్రతకు మరింత బలం చేకూరినట్లయ్యింది. రాష్ట్రంలో తీరప్రాంత రక్షణకు 12గస్తీ నౌకలను వినియోగిస్తున్నారు. కొత్తగా రూపొందించిన ఆయుష్ గస్తీ నౌకను కృష్ణపట్నం పోర్టు తీరప్రాంత రక్షణకు కేటాయించారు. నలుగురు అధికారులు, 33మంది సిబ్బంది ఈ నౌకలో పనిచేస్తారు. ఈ నౌకలో ప్రత్యేక ఆయుధాలు, అధునాతన సమాచర, నేవిగేషన్ వ్యవస్థలుంటాయి. గంటకు 33నాటికల్ మైళ్ళ వేగంతో ఇది ప్రయాణిస్తుంది. కోస్టుగార్డ్ సిబ్బందికి వసతి, కార్యాలయాల కోసం 26ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది.

# సర్వీసు రోడ్లపై నిర్లక్ష్యం తగదు

## ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో ప్రజలకు ఎంతో అవసరమైన సర్వీస్‌రోడ్లు వేయకుంటే ఆందోళన తప్పదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ నెల 4న ఆయన నెల్లూరులోని నేషనల్ హైవేస్ కార్యాలయంలో అధికారులను కలిసి ఈ విషయమై చర్చించారు. సర్వీస్ రోడ్లు, వంతెనల నిర్మాణాలు ఎంతోకాలంగా జాప్యం జరుగుతూనే వున్నాయని, ప్రజోపయోగకరమైన విషయాలపై నిర్లక్ష్యం తగదన్నారు. బుజబుజనెల్లూరు, కనుపర్తిపాడు, చిల్డ్రన్‌పార్క్, ఎన్టీఆర్ నగర్, పడారుపల్లి తదితర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సర్వీసు రోడ్లు, వంతెనలు నిర్మించాల్సి వుందన్నారు. బుజబుజనెల్లూరు దగ్గర సర్వీస్‌రోడ్డు లేకపోవడంతో రోజూ ప్రమాదాలు జరుగుతూనే వున్నాయని, ఈ విషయాన్ని అనేకసార్లు ఉన్నతాధికారులందరికీ తెలియజేశామని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదనతో అన్నారు. ప్రతిపాదనలు సిద్ధమై మూడు దశల్లో నిర్మాణాలు పూర్తిచేస్తామని అధికారులు చెప్తున్నా ఆచరణలోకి రావడం లేదన్నారు. వచ్చే నెలలో వీటి నిర్మాణాలు చేపట్టకుంటే ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. బి.శ్రీకాంత్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో సమున్నతంగా ఎదగాలి

## - వేడుకగా 'జనహిత-వాత్సల్య' రజతోత్సవం

విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదువుకుని సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రముఖ దాత, పారిశ్రామిక వేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఆకాంక్షించారు. నెల్లూరులోని కొండాయపాళెంరోడ్డులో వున్న జనహిత-వాత్సల్య సంస్థల రజతోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ వాత్సల్య సంస్థలో విద్యార్థులకు మంచి విద్యతో పాటు, మంచి నడవడికను, సంస్కారాన్ని అలవరచడం ఎంతో అభినందనీయమని ఆయన నిర్వాహకులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గుండెవ్యాధుల నిపుణుడు డాక్టర్ శ్రీనివాసరాజు పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతశిఖరాలను అందుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సింహపురి వైద్యసేవా సమితి అధ్యక్షుడు పొన్నలూరు సీతారామిరెడ్డి, మహవీర్ జైన్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మోహన్‌లాల్ జైన్, సోహన్‌లాల్ జైన్, జేపి జైన్, ప్రముఖ వ్యాపారవేత్త నరేష్‌రెడ్డి, ఆడిటర్ ఆమంచర్ల శంకరనారాయణ, ఇంకా మల్లికార్జునరావు, పుట్టా శేషులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'వాత్సల్య' విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ బాగా అలరించాయి.




# భగవాన్ వెంకయ్యస్వామి శతక పద్యాల సి.డి ఆవిష్కరణ


భగవాన్ వెంకయ్యస్వామి మహిమామృతం(ఆటవెలది) శతక పద్యాల ఆడియోసీడీని నెల్లూరు పొదలకూరురోడ్డు లేక్‌వ్యూ కాలనీలోని గాయని వి.లక్ష్మీభవాని నివాసంలో ఆవిష్కరించారు. పద్యాలను కవి మోపూరు పెంచల నరసింహం రచించగా గాయనీమణి ఏ.లక్ష్మీభవాని గానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సంగీత విద్వాంసుడు డి.వి.సురేష్‌రావు, ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల వీణా అధ్యాపకుడు మాదేశ్వర్ కుమార్, భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ కార్యదర్శి యనమండ్ర నాగదేవి ప్రసాద్‌లు పాల్గొని సి.డి.ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవంతుడిని చేరడానికి సులభమైన మార్గం సంకీర్తనం అన్నారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవులు తమ కవితలను వినిపించారు.



ఈ సందర్భంగా గాయని వి.లక్ష్మీభవానిని శాలువాతో సత్కరించారు. పెన్నా రచయితల సంఘం ప్రధానకార్యదర్శి గుండాల నరేంద్రబాబు, కవులు తోట సులోచన, దువ్వూరు సుమలత, ఇంద్రగంటి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# కల్యాణ వైభోగం...!



ఏ.ఎస్.పేట మండలం గుడిపాడు వాస్తవ్యులు అయ్యగారి మల్లిఖార్జునరెడ్డి - కృష్ణవేణిల కుమార్తె **రిషితరెడ్డి - కార్తీక్‌రెడ్డి** (బాలాయపల్లి మండలం జయంపు వాస్తవ్యులు వెందోటి మనోహర్‌రెడ్డి - లావణ్యల కుమారుడు)ల వివాహం ఈ నెల 1వ తేదీ నెల్లూరులోని కెజికె కళ్యాణ మండపం నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.



నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి మాటేటి రత్నప్రసాద్ - నీరజకళ్యాణిల కుమార్తె **ఊహారత్న - సునీల్‌కుమార్** (నెల్లూరు రూరల్ నారాయణరెడ్డిపేట వాస్తవ్యులు శ్రీమహారాజపురం రాజమణి - విజయల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 5వ తేదీ బుచ్చిరెడ్డిపాలెంలోని ఎస్.ఎస్.కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.

### రాజకీయాల్లో...

## విలువలే ముఖ్యమన్న వివేకా



రాజకీయాల్లో ప్రతి వ్యక్తికీ విలువలు ముఖ్యమంటూ మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి విలేకర్ల సమావేశం పెట్టి మరీ హిత బోధ చేశారు.

రాజకీయాల్లో విలువలు వెతుక్కోవడమంటే బురదగుంటలో దిగి మంచి నీళ్ళ కోసం దేవులాడడమే! రాజకీయాల్లో విలువల అడ్రస్ కూడా లేకుండా పోయింది. అది కూడా కాక తమకు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు కొండంత అండగా నిలిచి జిల్లా కాంగ్రెస్ పెత్తనాన్ని తమకు అప్పగించిన వై.యస్.రాజశేఖరరెడ్డిపై ఆయన మరణించాక విమర్శలు చేసిన వివేకా లాంటివాళ్ళు రాజకీయాల్లో విలువల గురించి మాట్లాడడం విచిత్రంగాను... వినడానికి విడ్డూరంగాను ఉంది. మొన్న మంగళవారం ఏ.సి సెంటర్‌లోని తన కార్యాలయం వద్ద ఆయన విలేకర్ల సమావేశం పెట్టి మరీ విలువల గురించి మాట్లాడారు. ఐఏఎస్, ఐపిఎస్‌లను బెదిరించి చెయ్యి ఎత్తి కొట్టేలా ఈరోజు ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రవర్తిస్తున్నాడన్నారు. అలాంటి వారు అధికారంలోకి వస్తే పరిపాలన ఎలా వుంటుందో ఒక్కసారి మనమందరం ఆలోచించుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయ పరిపక్వత చెందిన మేధావి వర్గానికి సంబంధించిన ఎన్నికలని రాజకీయ అవపాసన చేసిన మేధావులందరికి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. తెలుగుదేశం పార్టీ బలపరచిన అభ్యర్థులు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, వాసుదేవనాయుడులను, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఉగ్రవాదాన్ని, రౌడీ రాజకీయం, ప్రభుత్వ అధికారులను కొట్టడం, బెదిరించడం లాంటి అభ్యర్థులకు మనం ఓటు వేస్తే మన నాశనాన్ని మనమే కోరుకున్నట్లని తెలిపారు. ఆనం రంగమయూర్‌రెడ్డి, బర్నాబాస్, పేరారెడ్డి, మదన్, విజయ్, రాజేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వడ్డీ లేని రుణాలివ్వాలి



అన్ని రంగాల్లో వెనుకబడిన ముస్లింలకు వడ్డీ లేకుండా రుణాలు మంజూరు చేయాలని కోరుతూ ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుస్సమీ ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రాబోయే బడ్జెట్‌లో ముస్లింలకు ప్రత్యేక సబ్సిడీ రుణాలివ్వాలని, బ్యాంకులతో రుణాలకు ముడిపెట్టరాదని కోరారు. ప్రభుత్వం అన్ని వర్గాల మాదిరిగానే ముస్లింలపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో షాహీద్, మైనుద్దీన్, షాన్‌వాజ్, సాబీర్, గౌస్‌బాషా, షఫి, సికిందర్ పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## మహిళల్లో చైతన్యం అవసరం




మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి విజయమ్మ

మహిళల హక్కులను సాధించుకునేందుకు సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు చైతన్యం అవసరమని ఐద్వా జిల్లా కార్యదర్శి విజయమ్మ తెలిపారు. చిల్లకూరులోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ సంఘం ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘం అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. కనీస వేతన చట్టం అమలుతో పాటు స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్‌తో ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ డివిజన్ కార్యదర్శి పద్మావతి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అళఘునాథస్వామి బ్రహ్మోత్సవాలు

గూడూరు పట్టణంలో శ్రీ అళఘునాథస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు మంగళవారం నుండి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షులు సిద్దారెడ్డి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమద్ అళఘునాథస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. ఆలయ ప్రాంగణమంతా ప్రత్యేక పందిళ్ళను ఏర్పాటు చేశారు.

## బార్ నూతన కార్యవర్గం

గూడూరు న్యాయవాదుల సంఘం (బార్ అసోసియేషన్) నూతన అధ్యక్షుడుగా వేలూరు గోపికృష్ణ ఎన్నికయ్యారు. ఈమేరకు గోపికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017-18 వార్షిక సంవత్సరానికి ఎన్నికల అధికారి పాతపాటి హరనాథ ప్రసాద్ అధ్యక్షతన ఫిబ్రవరిలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఉపాధ్యక్షుడుగా దయాకర్, ప్రధానకార్యదర్శిగా దినకర్‌రెడ్డి, సహాయకార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా మహమ్మద్, సభ్యులుగా శ్రీనివాసులు, వహీద్, పి.శ్రీనివాసులు, యాసఫ్‌హుస్సేన్, పట్నం శ్రీనివాసులు తదితరులు ఎంపికయ్యారు.

## స్వచ్ఛంధ సంస్థల సేవలు అభినందనీయం



దివ్యాంగులతో సి.రోహిణి, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి

పేదలకు సేవ చేయాలనే మంచి ఉద్దేశ్యంతో స్వచ్ఛంధ సేవా సంస్థలు పని చేయడం అభినందనీయమని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి అన్నారు. గూడూరు పట్టణంలోని కృష్ణ మందిరంలో చిల్లకూరు మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సమితి (ఎంపిటిసి) సభ్యురాలు జీవని దాతృత్వంతో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఫల సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ ప్రతి నెల ఫలసరుకులు దివ్యాంగులకు అందించడం సంతోషకరమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు సుధీర్, వేగూరు రాజేంద్రప్రసాద్, రాజేష్, శ్రీధర్, కౌన్సిలర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు




మాట్లాడుతున్న డాక్టర్ సి.రోహిణి తదితరులు

విద్యార్థులు కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని మై ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాహుల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలంటే 10వ తరగతిలో మంచి మార్కులు తెచ్చుకోవాలని, కావున ప్రతి విద్యార్థి కూడా తమ మేధాశక్తితో, ప్రతిభతో రాణించాలన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాహుల్ మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువ ఒత్తిడికి గురికాకుండా పరీక్షలను బాగా రాయాలని కోరారు.

గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులకు పరీక్ష సామాగ్రిని సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి అధ్యక్షురాలు సౌందర్యమ్మ, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు మమత, మైఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ‘దేశం’ క్యాంపులో తారల సందడి

గల్పిక

అది ప్రపంచంలోని మేటి నగరాలన్నింటిని మిక్సీలో వేసి గ్రైండ్ చేసి బయటకు తీస్తే వచ్చిన అమరావతి రాజధాని నగరం. సీఎం ఛాంబర్‌లో హైటెక్‌రత్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు లోకేష్, ఐఆర్20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమల ఉత్పత్తి కేంద్రం నెల్లూరు నుండి వచ్చిన నాయకులు నైట్‌రైడర్ నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద రవిచంద్ర, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావు, ఎమ్మెల్సీ అభ్యర్థి వాకాటి నారాయణ రెడ్డి... ఇంకా కొంతమంది నాయకులున్నారు. నెల్లూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డి గెలుపోటములపై మాట్లాడ్డానికి చంద్రబాబు అందర్నీ అక్కడకు పిలిపించాడు. నేను స్టేట్ అంతా వన్‌సైడ్ ఎలక్షన్ జరిపించాలనుకుంటున్నాను. ఆ విధంగా కృషి చేస్తున్నాను, ఆ విధంగా ముందుకు పోతున్నాను, అందుకు ఆఖరకు పోలీసులను కూడా మన కార్యకర్తల మాదిరిగా వాడుకుంటున్నాను, నాకు అన్ని జిల్లాలు ఒకెత్తయితే, మీ ఒక్క జిల్లా ఒకెత్తు. మీ నెల్లూరు రెడ్లే నాకు అర్థం కారు... అన్ని జిల్లాలలో ప్రతిపక్ష నాయకులు మన శిబిరాలలో చేరుతుంటే, మీ జిల్లాలో మాత్రం మనోళ్ళు ప్రతి పక్షంలోకి పోతున్నారు. ఎందుకిలా జరుగుతోంది... నాకు తెలియాలి అని చంద్రబాబు హూంకరించాడు. అప్పుడు బీద రవిచంద్ర లేచి... ఇప్పుడున్నది పూర్తి తెలుగుదేశం పార్టీ కాదు కదా సార్, సగానికి పైగా కాంగ్రెస్ నాయకులతో నిండిపోయింది, వాళ్ళకు కుదురుగా ఒక చోట ఉండడం తెలియదు. వానలు పడ్డప్పుడు కప్పలు, అటు ఇటూ గుంటల్లోకి ఎగిరినట్లు, ఏ ఎన్నికలొచ్చినా వీళ్ళు కూడా అటూ ఇటూ మారుతుంటారని అన్నాడు. చంద్రబాబు అందుకు... నాకు మీ జిల్లా స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు మీద సందేహంగా ఉంది. ముఖ్యంగా అవతల ఆనం విజయకుమార్‌రెడ్డి అభ్యర్థి. మీ బ్రదర్స్ ఇద్దరూ మీ తమ్ముడి కోసం పని చేస్తున్నారా? లేక పార్టీ అభ్యర్థి కోసం పని చేస్తున్నారా? అని ఆనం రామనారాయణరెడ్డిని ప్రశ్నించాడు. అప్పుడే... ఆపు... అంతకుమించి ఒక్క మాట మాట్లాడినా బాగుండదు... అంటూ తలుపు వైపు నుండి ఓ కేక వినిపించింది. చంద్రబాబుతో పాటు అందరూ తలలు తిప్పి గుమ్మం వైపు చూసారు. అక్కడ స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(65) నిలబడి ఉన్నాడు. చంద్రబాబు రామనారాయణరెడ్డిని నిలదీస్తున్న సమయానికే వివేకా వచ్చి అక్కడ నిలబడ్డాడు. చంద్రబాబు తమ మీద అనుమాన పడ్డం చూసి కోపంతో వూగిపోతూ ఆ మాటన్నాడు. చంద్రబాబూ... నిప్పును పట్టుకో... మండదేమో, నీటిలో మునుగు తడవవేమో... మా చిత్తశుద్ధితో పెట్టుకోకు... తట్టుకోలేవ్... ఏమను కుంటున్నావ్ మమ్మల్ని, ఏమనుకుంటున్నావ్ మా నిజాయితీని, రాజకీయాల కోసం అయినవారిని, అన్నదమ్ములను కూడా కాదను కోవడంలో ఎప్పుడో మిమ్మల్ని మించిపోయాం... నువ్వా మా పనితీరును శంకించేది... అయినా ఈ చీకటిలో మీటింగ్‌లేంటి అని వివేకా అడిగాడు. మొదట అడిగినదానికంతా ఎవరూ ఏమీ అనుకోలేదుగాని, చీకట్లో మీటింగ్ లేంటనే సరికి అందరూ ఆశ్చర్యపోయారు. ఎందుకందే ఆ గదంతా లైట్లతో వెలిగిపోతోంది. అందరికంటే ముందు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అసలు విషయాన్ని పసిగట్టి వివేకా కళ్ళకున్న నల్లద్దాలను తీసాడు. అప్పుడు వివేకాకు విషయం అర్థమైంది. చంద్రబాబు అనుమానాస్పద ప్రశ్నకు వివేకా ఘాటుగా కొంచెం నాటుగా సమాధానమివ్వడంతో అక్కడ వాతావరణమంతా గంభీరంగా మారిపోయింది.

ఆ నిశ్శబ్దాన్ని ఛేధిస్తూ చంద్రబాబు... ఇది ఎవరి నీతి నిజాయితీలకు పరీక్షా సమయం కాదు, నెల్లూరు స్థానిక ఎమ్మెల్సీ అభ్యర్థి వాకాటిని ఎలాగైనా గెలిపించాలి, ఇందుకేం చేయాలని అడిగాడు. మధ్యలో వాకాటి జోక్యం చేసుకుని... వీళ్ళందర్నీ బ్రతిమలాడేందన్నా... మనది అధికారపార్టీ... భయపెట్టి కొందర్ని తెద్దాం, బెదిరించి కొందర్ని తెద్దాం, భయపెట్టినా, బెదిరించినా లొంగనివారిని తాళ్ళతో కట్టేసి మన క్యాంపుకు తెద్దామన్నాడు. అప్పుడే పోలంరెడ్డి లేచి బయటకు పోబోయాడు... ఎక్కడకు వెళుతున్నావని చంద్రబాబు ప్రశ్నించారు... తాళ్ళు కొనుక్కురావడానికన్నా... వాకాటి చెప్పిన ప్రాసెస్ చాలా ఈజీగా ఉందన్నాడు. నీ ముఖమాల్నే వుంది కూర్చో... బెదిరించేది, భయపించి గెలిచేది రాజకీయం కాదు. స్థానిక ఓటర్లను మనం ఆకర్షించాలి... అందుకు మనమేం చేయాలో చెప్పండని చంద్రబాబు అడిగాడు. చెప్పను, చేసి చూపిస్తాను, ఆ సంగతి నా కొదిలేయండి అని వివేకా లేచాడు. అందరు కూడా వివేకా నెత్తిన భారం పెట్టి మాకు తలనొప్పి తప్పిందంటూ లేచారు.

తెల్లారింది. చంద్రబాబు అప్పుడే లేచాడు. యోగాసనాలు వేద్దామని రెడీ అవుతుండగా ఆయన ఫోన్ మోగింది. ఫోన్ ఆన్ చేసాడు. అవతల నుండి పార్టీ ఏ.పి అధ్యక్షుడు కళా వెంకట్రావ్... సార్, కొంప మునిగిందన్నాడు. ఏమైందని చంద్రబాబు ఆతృతగా ప్రశ్నించాడు. ముందు టీవీ ఆన్ చేసి 9-9-99 ఛానెల్ పెట్టి చూడండన్నాడు. చంద్రబాబు ఫోన్ కట్ చేసి టీవీ ఆన్ చేశాడు.

చెన్నైలో నెల్లూరుజిల్లా తెలుగుదేశం ఎమ్మెల్సీ అభ్యర్థి క్యాంప్ అది... క్యాంప్ బయట వందలాదిమంది నిలబడి తమను కూడా క్యాంప్‌లోకి తీసుకోవాలని నినాదాలు చేస్తున్నారు. పోలీసులు మాత్రం వాళ్ళను వెనక్కునెట్టేస్తున్నారు. క్యాంప్ లోపలవున్న వివేకా, సోమిరెడ్డి, బీద, ఆదాలలు గేటు వద్దకు వచ్చి బయట తోసుకుంటున్న వారిని వారిస్తూ... మీ క్యాంప్ ఇక్కడ కాదు, మా వాళ్ళకే ఇక్కడ చోటు చాలడం లేదని చెబుతున్నారు. అయినా అక్కడున్నవాళ్ళు తమను కూడా లోపలకు అనుమతించాలని రచ్చ చేస్తున్నారు. చంద్రబాబుకు పిక్చర్ కనిపించింది గాని విషయం అర్థం కాలేదు. వెంటనే కళావెంకట్రావ్‌కు ఫోన్ చేశాడు. ఆయన ఫోన్ ఎత్తాడు. నెల్లూరు స్థానికఎమ్మెల్సీ క్యాంప్ వద్ద ఏం జరుగుతుందని చంద్రబాబు అడిగాడు. అందుకాయన... మీరు ఆ క్యాంప్ బాధ్యత వివేకాకు అప్పగించినట్లున్నారు... అతను క్యాంప్‌లో కాజల్, తమన్నా, రకుల్‌ప్రీత్‌సింగ్, హంసానందినిల చేత డ్యాన్స్ ప్రోగ్రామ్, అనసూయ, రష్మిల యాంకర్‌లుగా వస్తున్న ‘జబర్దస్త్’ ప్రోగ్రామ్‌లు పెడుతున్నామని ప్రచారం చేసాడు. ఆ ప్రచారం కర్నూలు, కడప జిల్లాల్లో వున్న మన జడ్పీటీసీ, ఎంపీటీసీలకు కూడా తెలిసింది. దీంతో నెల్లూరోళ్లే కాదు, కడప, కర్నూలు జిల్లాల వాళ్ళు కూడా అక్కడకు వెళ్ళి తమను నెల్లూరు క్యాంప్‌లోకి అనుమతించాలని గొడవ చేస్తున్నారని చెప్పాడు. ఆ మాటతో చంద్రబాబు... ఎంత పని చేసావు వివేకా అంటూ తల పట్టుకున్నాడు.

★★★★★

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఖర్చుల భారం పెరుగుతుంది. అయినా అవసరాలలో డబ్బు అందుతుంది. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగవు. ఆదాయం తగ్గుతుంది. తొందరపాటు ప్రవర్తన, మాటలు తగ్గించుకొనండి. ముఖ్య అవసరాలను కొన్నింటిని వాయిదా వేసికొనక తప్పదు. పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఆరోగ్యం కూడా స్వల్ప ఇబ్బంది కలిగిస్తుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆర్థిక పరిస్థితి బాగుండి ఆదాయం సంతృప్తి కరము. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. చేపట్టిన పనులు నిదానంగా జరుగుతాయి. కొత్త పథకాలు ఆలోచనలతో వృత్తి వ్యాపారాలలో ముందుకు సాగుతారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, శ్రమ ఉంటుంది. పెద్దమొత్తాలలో లావాదేవీలను వాయిదా వేయండి. శ్రమ ఉంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

బంధుమిత్రులకు సహాయపడతారు. అదనపు ఆదాయముంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. విలువైనవి నూతనమైనవి వస్తు సామాగ్రిని సమకూర్చుకొంటారు. ఉద్యోగావకాశాలు లభించగలవు. సభలు సమావేశాలలో ప్రముఖబాధ్యతలు నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగి ఆదాయం పెరుగుతుంది. కొత్త పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అనుకున్న పనులు సులువుగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలు వృద్ధి చెంది ఆదాయం పెరుగుతుంది. ప్రభుత్వ పరంగా స్వల్ప ఇబ్బందులుండవచ్చును. సోదరుల కుటుంబాలకు మేలు జరుగుతుంది. శుభ కార్యాలు నిర్ణయం కాగలవు. ఆర్థిక లావాదేవీలు, డబ్బు వ్యవహారాలలో విశ్రాంతి లేకుండా ఉంటారు. కుటుంబ సభ్యులతో కొద్ది విభేదాలు చోటు చేసికొంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

పనుల వత్తిడి, అనుకున్న పనులు సవ్యంగా జరుగక టెన్షన్ పడుతుంటారు. వ్యాపారవృద్ధి సరిగా ఉండదు. ఆర్థికావకాశాలు చేజారిపోయే పరిస్థితులుంటాయి. ఆదాయం తగ్గి ఖర్చులు పెరుగుతాయి. వస్తువాహన గృహ రిపేర్ల ఖర్చులు పైనబడతాయి. నిర్మాణాలు జరుపుతున్న వారికి, కాంట్రాక్టర్లకు పనులు మందగించగలవు. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత తక్కువ.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థికస్థితి బాగుండి వ్యాపారవృద్ధి అవకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. పెట్టుబడులు, షేర్లపై లాభాలుంటాయి. అనుకున్న పనులు బాగా శ్రమపెట్టి నెరవేరగలవు. వాహనాలు నడిపేవారు, కరెంటు యంత్రాలతో పనులు చేసేవారు గాయాలు తగలకుండా జాగ్రత్తపడాలి. నూతన వస్తువులను సమకూర్చుకొంటారు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 10.3.2017 నుండి

తేది. 16.3.2017 వరకు

ఈ వారం మేషంలో కుజుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, సింహ కన్య తులా రాశులలో చంద్రుడు, ధనుస్సులో శని, కుంభంలో రవి కేతువులు, 14తేది నుండి మీనంలో రవి, మీనంలో బుధ శుక్రులు సంచరిస్తారు.

పంచాంగము

ముహూర్తములు

తేది 10 ఆదివారము రాత్రి 10.30 నుండి గంట 12.36లోగా వృశ్చిక లగ్నమున వివాహ గృహ ప్రవేశములు.

### ఫాల్గుణ మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 10 | శుక్ర | త్రయోదశి | రా॥ గం.8.47వ॥ |
| తేది. 11 | శని | చతుర్దశి | రా॥ గం.8.8వ॥ |
| తేది. 12 | ఆది | పూర్ణిమ | రా॥ గం.7.47వ॥ |

### ఫాల్గుణ మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 13 | సోమ | పాడ్యమి | రా॥ గం.7.59వ॥ |
| తేది. 14 | మంగళ | విదియ | రా॥ గం. 8.45వ॥ |
| తేది. 15 | బుధ | తదియ | రా॥ గం.9.48వ॥ |
| తేది. 16 | గురు | చతుర్థి | రా॥ గం.11.38వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలు ఆశించిన రీతిలో సాగక, ఆదాయము తగ్గుతుంది. స్థిరాస్తుల లావాదేవీలు, కొత్త పెట్టుబడుల విషయంలో తొందరపడవద్దు. గృహ వస్తు వాహన రిపేర్ల ఖర్చులుంటాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. బంధువర్గంతో విభేదాలు చోటు చేసికొంటాయి. తొందరపాటు నిర్ణయాలు చేయవద్దు. మొగమాటాలకు పోవద్దు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనుకున్న పనులు నిదానంగా జరిగి సానుకూలం కాగలవు. వ్యాపారవర్గాలకు మంచి అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. వృత్తిపరంగా నిలద్రొక్కుకుంటారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. ముఖ్యమైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త పరుచుకొనండి. బిడ్డల విద్యా, వివాహ విషయాలలో శ్రద్ధ చూపుతారు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారాలు నిర్వహించేవారికి, కాంట్రాక్టర్లకు ఆర్థిక అవకాశాలు బాగుండి, ఆదాయం పెరుగుతుంది. అయితే వర్కర్లతో సమస్యలు రావచ్చును. చేసే పనులకు పరిస్థితులు అనుకూలిస్తాయి. శుభకార్యాలు నిర్ణయం కావడం, దూరప్రయాణాలుంటాయి. స్థిరాస్తుల మీద, పెట్టుబడుల మీద రాబడి ఉంటుంది. రావలసిన బాకీలు కొంతవరకు అందుతాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి ఉపాధి పథకాలలో నిలద్రొక్కుకొని, ఆదాయం పెంచుకొంటారు. వ్యాపారవృద్ధి అవకాశాలు లభిస్తాయి. అనుకొన్న పనులకు ఆటంకాలు కలుగుతుంటాయి. అయినా ఏదో విధంగా సానుకూలం చేసికొంటారు. ఉద్యోగులకు కార్యసామర్థ్యం బాగుంటుంది. స్థిరాస్తులు, విలువైన వస్తువులు ఏర్పరచుకునే అవకాశాలుంటాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

చేపట్టిన పనులను పట్టుదలతో సానుకూలం చేసికొనగలరు. ఋణ బాధలు సర్దుబాటు కాగలవు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. అయితే పనులందు అప్పుడప్పుడు టెన్షన్ ఉంటుంది. కుటుంబ, ఆర్థిక విషయాలను తొందరపడి ఇతరులకు వెల్లడించవద్దు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. తొందరపాటు మాటలు, ప్రవర్తన లేకుండా వ్యవహరించండి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. నిర్మాణాలు, కాంట్రాక్టు పనులు చురుకుగా సాగగలవు. అదనపు ఖర్చులుండినను ఇబ్బంది ఉండదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగి ఆదాయం పెరుగుతుంది.

# జిల్లా మహిళలకు అత్యున్నత గౌరవం



నూటికి నూరు శాతం మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి చేసిన నెల్లూరుజిల్లాకు చెందిన పలువురు మహిళలు ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. దక్కిలి మండలం డీవడ్డిపల్లి సర్పంచ్ వేపమాను చెంచమ్మ, కలువాయి మండలం ఇస్కపల్లి సర్పంచ్ చిన్నమ్మ, పెళ్ళకూరు మండలం అనకవోలు సర్పంచ్ అంకమ్మ, నెల్లూరురూరల్ ఎంపిడిఓ వసుమతి, పెళ్ళకూరు ఎంపిడిఓ సరళ, ఆత్మగౌరవం జిల్లా కో-ఆర్డినేటర్ సుస్మితారెడ్డి అవార్డులు అందుకున్నారు. ఈ మహిళామణులకు 'లాయర్' అభినందనలు.

# వసంతలక్ష్మికి రాష్ట్ర ప్రభుత్వం అవార్డు



ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ తుమ్మల పల్లి కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా నెల్లూరుకు చెందిన వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డా॥ టి.వసంతలక్ష్మి ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్నారు. స్త్రీ శిశు సంక్షేమ రంగంలో విశేషకృషి చేసినందుకుగాను ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖామంత్రి పీతల సుజాత, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మెన్ నన్నపనేని రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నెల్లూరు పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో ఈ నెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా॥ టి.లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 60మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా॥ టి.లక్ష్మి మాట్లాడుతూ సమాజ అభ్యున్నతికి మహిళలు ఎంతో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని, వారు వారి ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సంవత్సరంలో ఒక్కసారైనా తగిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిపించుకుని క్యాన్సర్, షుగర్, అధిక రక్తపోటు లాంటి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ హాస్పిటల్ మహిళా దాతలు జి.కన్యాకుమారి, సి.సుభాషిణి, కె.సీతాలక్ష్మి, సిహెచ్ సుప్రియ, వళ్ళీ, గూడూరు లక్ష్మి, డా॥ పి.స్వర్ణలత, కె.ఎల్.సరోజిని, డి.జ్యోత్స్న, ఉషా పాల్గొన్నారు.



ఈ నెల 8, బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గూడూరు ద్వారకామాయి ఫంక్షన్‌హాల్లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సుగుణ, డాక్టర్ ఉమ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనలను సన్మానిస్తున్న ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి, మహిళా మండలి అధ్యక్షురాలు సౌందర్యమ్మ తదితరులు

# నెల్లూరులో సంగీత మొబైల్ షోరూం



దక్షిణ భారతదేశంలోని అగ్రగామి మొబైల్ ఫోన్ షోరూంలలో ఒకటిగా పేరుగాంచిన సంగీత మొబైల్ షోరూంలను జిల్లాలో ఆరుచోట్ల సోమవారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విజయ ఇండస్ట్రీస్ అధినేత విజయ్‌గోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతిప్రకాశనం చేశారు. సుబేదారుపేటలోని న్యూటాకీస్ ఎదురుగా, దర్గామిట్ట ఎంజిబి మాల్‌లో, వేదాయపాలెంలో షోరూంలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సంగీత మొబైల్ అధినేత తన వద్ద మొదట సేల్స్ రంగంలో పనిచేసి కార్యదక్షతతో మొబైల్ షోరూంల అధినేతగా ఎదిగారని కొనియాడారు. సంగీత మొబైల్స్ అధినేత లక్కు సుభాష్‌చంద్ర మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు మొబైల్‌ఫోన్ కొన్నవారికి బహుమతులుగా ఫ్రిజ్, టీవీలు, వాషింగ్‌మిషన్లు, బైక్‌లు అందజేస్తామన్నారు. చివరలో లక్కీ డ్రా నిర్వహించి విజేతకు బహుమతిగా కారును అందిస్తామన్నారు. ఫోన్ కొన్న 15రోజుల్లో కంపెనీ ధర తగ్గిస్తే ఆ రేటుకే ఫోన్ ఇస్తామన్నారు. జిల్లాలోని సూళ్ళూరుపేట, నాయుడుపేట, శ్రీకాళహస్తిలలో షోరూంలను ప్రారంభించినట్లు తెలిపారు. సంగీత షోరూంల అధినేత లక్కు నారాయణరెడ్డి, డైరెక్టర్ భువనేశ్వరి, మార్కెటింగ్ ఆఫీసర్ గౌతంరెడ్డి, చీఫ్ పీపుల్ ఆఫీసర్ అనిల్‌కుమార్‌రెడ్డి, సాయిచంద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

## - మహిళాదినోత్సవంలో వక్తల ఆకాంక్ష



మహిళలు అన్నిరంగాల్లో ప్రతిభా పాటవాలతో రాణించాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నెహ్రూ యువకేంద్రం-నెల్లూరు జిల్లా రచయితల సంఘం (నెరసం) సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కస్తూరిభా కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధ శాఖ డిప్యూటి డైరెక్టర్ లాల్‌జాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళాభ్యున్నతికి అందరూ కలసి బాటలు వేయాలన్నారు. నెహ్రూ యువకేంద్రం అధికారి శేఖర్ మాట్లాడుతూ, మహిళాభ్యున్నతే సామాజిక అభ్యున్నతి అని, మహిళలను గౌరవించడం అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమానికి నెరసం అధ్యక్షుడు ఏ.జయప్రకాష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థిని బి. నిర్మల ఈ పోటీల్లో ప్రథమస్థానం సాధించగా, అదే కళాశాలకు చెందిన ఎం.హరిప్రియ ద్వితీయ స్థానం సాధించింది. బిఇడి కళాశాల విద్యార్థిని ఎం.వైష్ణవి తృతీయ స్థానం సాధించింది. వీరితో పాటు మరో నలుగురు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. అనంతరం సేవారంగంలో వుంటూ సమాజానికి స్వచ్ఛంధసేవలందిస్తున్న పలువురు మహిళలను సన్మానించారు. ప్రగతి ఛారిటీస్ నిర్వాహకురాలు సుశీల, కావలికి చెందిన మైత్రి మహిళాబ్యాంక్ ఛైర్మెన్ కె.రమాదేవి, మహిళా మండలి సంస్థ నిర్వాహక అధ్యక్షురాలు జి. పద్మ ఈ సన్మానాలను అందుకున్నారు. అదేవిధంగా, రాష్ట్రస్థాయి వెటరన్ క్రీడాకారిణి, అనేక బంగారు పతకాలను సాధించిన శ్రీమతి సోలా జానకిని, కవయిత్రి ములుగు విజయదుర్గలను కూడా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ప్రముఖ కవయిత్రి పాతూరు అన్నపూర్ణ, స్వచ్ఛంధసంస్థల ప్రతినిధి ఇవిఎస్ నాయుడు, ఆచార్య ఆదిత్య, వై.టి రమేష్‌బాబు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# హోదా విషయంలో ప్రత్యేక దగా

## - డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య



ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా విషయంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు దగా చేసాయని డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం నెల్లూరుజిల్లా గూడూరు పట్టణంలోని రోటరీ క్లబ్‌లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై జన ఆవేదన సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐసిసి కో-ఆర్డినేటర్ మిరిత్ ధర్మసేన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పనబాక మాట్లాడుతూ దేశంలో ప్రజలు కరువు కాటకాలతో అల్లాడుతున్నారని, రాష్ట్రంలో ప్రజలు సాగు, తాగు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పరిస్థితులను సరిచేయకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను నాశనం చేసేందుకు రకరకాలుగా కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు వేసుకున్న పంటలు ఎండిపోతున్నాయని సాగునీరు అందించవలసిన ప్రభుత్వాలు రైతుల సమస్యలను గాలికి వదిలేశాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి 2014లో 600 హామీలు గుప్పించి నేడు ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా కాంగ్రెస్ సంక్షేమ పథకాల పేర్లు మార్చుకుని ప్రచార ఆర్భాటాలు చేస్తున్నారే తప్ప ప్రజల సంక్షేమం, ఇచ్చిన హామీలను మరిచారన్నారు.

ఏఐసిసి కో-ఆర్డినేటర్ మిరత్ ధర్మసేన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ 2019లో కేంద్రంలో, ఏపిలో విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. 2019లో 300పైగా ఎం.పి సీట్లను కైవసం చేసుకోవడం తథ్యమన్నారు. పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి, డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య కాంగ్రెస్‌పార్టీ కోసం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కేంద్రప్రభుత్వం ప్రజలను నిలువుదోపిడి చేస్తుందని, ఈ దోపిడీలను అరికట్టేందుకే జన ఆవేదన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. మాజీ ఎంఎల్ఏ సి.వి.శేషారెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, చెంచలబాబుయాదవ్, సీతారాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### కన్యకాపరమేశ్వరి దేవస్థానం

# కొత్తపాలక వర్గం ప్రమాణస్వీకారం



నెల్లూరీయుల ఇలవేల్పు, స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణస్వీకారోత్సవం ఈ నెల 2వ తేదీన దేవస్థానం ప్రాంగణంలో ఘనంగా జరిగింది. కొత్త పాలక మండలికి గౌరవాధ్యక్షులుగా డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్, అధ్యక్షులుగా దాసా సురేష్‌రాజా, ఉపాధ్యక్షులుగా సుంకు మనోహర్, కార్యదర్శిగా అయితా రామచంద్రరావు, సహాయ కార్యదర్శిగా దొంతంశెట్టి వివేకానందం, కోశాధికారిగా పబ్బిశెట్టి శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులుగా చలువాది శరణ్‌కుమార్, కోట సూర్యనారాయణ, సరాబు సుబ్రహ్మణ్యం, శ్రీరాం సురేష్, నాగసూరి కామేశ్వరరావు, పేర్ల సీతారామారావు, మంజులూరు శ్రీనివాసులు, బచ్చుబాబు, అయితా భాస్కర్, జొన్నలగడ్డ శ్రీనివాసులు, సముద్రాల వెంకటసత్యనారాయణ, గంగిశెట్టి మల్లిఖార్జునరావులు ప్రమాణస్వీకారం చేసారు.

# ముక్కలు చూపించిన జగన్

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ భవనాన్ని ప్రారంభించిన రెండో రోజే ఓటు–నోటు కేసులో చంద్రబాబు పాత్రపై దర్యాప్తు జరపమంటూ సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఇక కొత్త అసెంబ్లీ భవనంలోనూ పాత సంప్రదాయాలను కొనసాగిస్తూ ప్రతిపక్షం నోరు మూయించాలని అధికారపక్షం పన్నిన ఎత్తులను ప్రతిపక్ష నేత వై.యస్. జగన్మోహన్‌రెడ్డి సమర్ధవంతంగా తిప్పి కొట్టారు. రాష్ట్రాభివృద్ధి గురించి కాకిలెక్కలు చెప్పిన చంద్రబాబు ప్రభుత్వానికి జగన్ గణాంకాలతో సహా వివరించి ముక్కలు చూపించాడు. వృద్ధిరేటులో అంకెలగారడీ సృష్టించిన చంద్రబాబుకు కలవరం తెప్పించాడు. ఏపి రాజధాని అమరావతిలో తొలి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించుకుంటున్నాం. సమావేశాలలో తొలిరోజే గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వం లేని గొప్పలకు పోయింది. దేశం మొత్తం మీద జిడిపి రేటు 7.1శాతం ఉంటే, మన రాష్ట్రంలో మాత్రం 12.23 శాతం ఉన్నట్లు చెప్పారు. పక్కరోజు అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జగన్ చేసిన ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకోగా, అధికారపక్షాన్ని ఇరకాటంలోకి నెట్టింది. ఈ సభలో జగన్ పరిణితి చెందిన నాయకుడిగా వ్యవహరించారు. అధికార పక్షం అతనిని రెచ్చగొట్టి సభను వాయిదా వేయించాలని చూసినా అతను ఏ మాత్రం అవకాశమివ్వలేదు. ప్రభుత్వం చెప్పిన కాకి లెక్కలను తూర్పారబట్టారు. కేంద్రం జిడిపి రేటు 7.1శాతం వుంటే మన జిడిపి రేటు 12.23శాతం ఎలా వచ్చింది. కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలు జిడిపి రేటులో మనకన్నా వెనుకబడి ఉన్నాయా? విభజన తర్వాత ఆదాయం వచ్చే హైదరాబాద్‌ను కోల్పోయాము... వరుసగా మూడేళ్ళ నుండి కరువులే... వర్షాలు లేవు, పంటలు లేవు, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. కనీసం మీ పాలనలో చేపలకు కూడా రేట్లు లేవు. మరి వ్యవసాయం, మత్స్యశాఖల్లో అంతంత అభివృద్ధి రేటును చూపించారు. మనం గొప్పగా వున్నామని లేని గొప్పలు చూపించడమెందుకు? దేశంలోనే మేము అందరికంటే అగ్రస్థానంలో వున్నామని కాకిలెక్కలు చూపిస్తే, ఇక కేంద్రం మనకు నిధులెలా ఇస్తుందంటూ జగన్ వేసిన ప్రశ్నలకు అధికారపక్షం సమాధానం చెప్పలేకపోయింది.

గవర్నర్ ప్రసంగంలోని ప్రతి అంశంపై జగన్ మాట్లాడారు. గవర్నర్ చేత అబద్దాలు చెప్పించారంటూ తాను చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించారు. జిడిపి వృద్ది రేటును ఎండగట్టిన తీరులోనే రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుపై ప్రభుత్వం చెబుతున్న లక్షల కోట్ల పెట్టుబడులు కూడా ఉత్తుత్తివేనని తేల్చారు. ప్రత్యేకహోదాను ఎత్తేస్తున్నారని ప్రభుత్వం అంటోందని, కాని జిఎస్టీ అమలు తర్వాత కూడా ప్రత్యేక హోదా అమలులో వున్న రాష్ట్రాలకు ప్రత్యేక రాయితీలు అందించడానికి కేంద్రమే సన్నాహాలు చేస్తున్న విషయాన్ని ఆయన సభలో వివరించారు. అలాగే నదుల అనుసంధానం పేరుతో జరుగుతున్న అవినీతిని కూడా ఆయన తూర్పారబట్టారు.

స్పీకర్ అరగంట సమయమే ఇచ్చినా దానిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకున్నారు. పదునైన ఆరోపణలు, వివరాలతో అధికారపక్షాన్ని ఉక్కిరిబిక్కిరి చేసారు. అసెంబ్లీలో జగన్ మాట, వ్యవహారశైలి కూడా ఎంతో హుందాగా వుండింది. సభలో మాట్లాడే ముందు ఆయన ప్రతి అంశాన్ని అధ్యయనం చేస్తున్నారు. తన ప్రసంగం మధ్యలో అప్పుడప్పుడు పంచ్‌లు వదులుతూ ఒకనాటి సభలో దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి శైలిని తలపింపజేస్తున్నారు.

# ఆనంకు 'హై'షాక్

(మొదటి పేజీ తరువాయి)

చెల్లవని ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించిన వివరాలలోకి వెళితే... 1875లో విఆర్ విద్యా సంస్థలను ప్రారంభించారు. బ్రిటీష్ వారి హయాంలో క్రైస్తవ మిషనరీ విద్యాసంస్థలను ఎక్కువగా నెలకొల్పుతున్నప్పుడు హిందూ విద్యార్థుల కోసం వెంకటగిరి రాజాలు ప్రత్యేకంగా ఈ విద్యాసంస్థను నెలకొల్పి, వీటి నిర్వహణకు వాళ్ళే ధనం సమకూరుస్తూ వచ్చారు. 1940 ప్రాంతంలో రాజా యాచేంద్ర ఈ విద్యాసంస్థల పాలక వర్గంలో తమకు అధికారం ఉండేలా ఒక ఒప్పందం చేసుకున్నారు. విద్యాసంస్థల పాలకవర్గ కమిటీకి ప్రతి ఐదేళ్ళకోసారి ఎన్నికలు జరిగేలా బైలాను రూపొందించారు. ఈ కమిటీలో నలుగురు సభ్యులు వెంకటగిరి రాజా కుటుంబం నుండి వుంటే మరో నలుగురు సభ్యులను పూర్వ విద్యార్థులు ఎన్నుకుంటారు. ఇలా ఎన్నికైన 8మంది కలిసి ఐదుగురిని కో–ఆప్షన్ సభ్యులుగా ఎన్నుకుంటారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా కొనసాగుతారు. బైలాలో వ్రాసుకున్న నిబంధనల ప్రకారం 1950, 1960, 1970లలో కమిటీలకు ఎన్నికలు జరిగాయి. 1970 వరకు విద్యాసంస్థల కమిటీపై వెంకటగిరి రాజాల పెత్తనమే కొనసాగింది. 1970లో పెద్దరాజా యాచేంద్ర మరణించారు. ఆ ఏడాది జరిగిన కమిటీ ఎన్నికల ద్వారా ఆనం వెంకటరెడ్డి విద్యా సంస్థల అధ్యక్షుడయ్యాడు. అక్కడ నుండి విఆర్ విద్యాసంస్థల్లో ఆనం ఆధిపత్యం మొదలై క్రమంగా వెంకటగిరి రాజాలు తెరమరుగయ్యారు. ఆనం వెంకటరెడ్డి, ఆనం భక్తవత్సలరెడ్డిలు విద్యాసంస్థలను పూర్తిగా తమ గుప్పిట్లోకి తెచ్చుకున్నారు. 1970 తర్వాత 1985 వరకు కమిటీకి ఎన్నికలు జరక్కుండా లాక్కొచ్చారు. అప్పట్లో ఏబివిపి విద్యార్థి సంఘం నాయకులైన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆమంచర్ల శంకరనారాయణ, చంద్రశేఖర్‌రాజులు కమిటీకి వెంటనే ఎన్నికలు నిర్వహించాలంటూ నెల్లూరులో ఆరురోజుల పాటు నిరాహారదీక్ష చేశారు. ఎన్నికలు నిర్వహిస్తామని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఇచ్చిన హామీతో వాళ్ళు దీక్ష విరమించారు. ఆయన ఇచ్చిన మాట ప్రకారమే విఆర్ విద్యాసంస్థల కమిటీకి ఎన్నికలు నిర్వహించారు. అయితే పూర్వ విద్యార్థుల ఓట్లతో ఎన్నికలు నిర్వహిస్తే తమకు వ్యతిరేక ఫలితాలు వస్తాయని భావించిన ఆనం కుటుంబీకులు బైలాను సవరించి పూర్వవిద్యార్థుల ఓట్లను రద్దు చేశారు. ఆ తర్వాత ఎన్నికలు పెట్టారు. ఈ ఎన్నికల్లో ఆనం వివేకానందరెడ్డి పోటీ చేశారు. అయితే తమ ఓట్లను తొలగించడాన్ని సవాల్ చేస్తూ నెల్లూరు సివిల్ కోర్టులో పిటిషన్ వేయడంతో కమిటీ ఎన్నికల ఫలితాలను నిలిపివేశారు. 1993దాకా ఈ కేసు నడిచింది. ఆ ఏడాది కోర్టు తీర్పు వెలువరిస్తూ పూర్వవిద్యార్థులు వేసిన పిటిషన్‌ను కొట్టి వేసింది. దీంతో 1986లో జరిగిన కమిటీ ఎన్నికల ఓట్లను లెక్కబెట్టగా ఆనం వివేకానందరెడ్డి భారీ మెజార్టీతో గెలిచాడు. పూర్వవిద్యార్థుల ఓట్లు లేకుండా చేయబట్టే ఆయన గెలవగలిగాడు. ఇక అప్పటి నుండి ఆనం వివేకానందరెడ్డి కరస్పాండెంట్ కమ్ సెక్రటరీగా, ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షుడిగా.. అంతా తామే అయ్యి ఈ విద్యాసంస్థలను నడిపిస్తున్నారు. ఈ రెండున్నర దశాబ్దాల వారి హయాంలో విఆర్ విద్యాసంస్థల ప్రతిష్ట మసకబారుతూ వచ్చింది. దీనికితోడు కార్పొరేట్ విద్య విజృంభించడంతో విఆర్ విద్యాసంస్థలు విద్యార్థులు లేక బోసిపోతూ వచ్చాయి. విఆర్ హైస్కూల్, విఆర్ జూనియర్ కాలేజీ, విఆర్ ఐపిఎస్, విఆర్ ఐఏఎస్, విఆర్ లాకాలేజీ, వి.ఆర్. పి.జి కాలేజీ... వీటిలో ఒక్క హైస్కూల్, లా కాలేజీలు మాత్రమే ఇప్పుడు కొంతవరకు సక్రమంగా నడుస్తున్నాయి. మిగతా కాలేజీలన్నీ కూడా విద్యార్థులు లేక బోసిపోతున్నాయి. ఇదంతా చాలదన్నట్లు వివేకా ఈ విద్యాసంస్థల దబ్బుతోనే క్రైస్తవ మిషనరీలకు చెందిన వైఎంసిఏ గ్రౌండ్ స్థలాన్ని కొనుగోలు చేసారు. విఆర్ బిఇడి కళాశాల పెట్టాలని చెప్పి, పెద్దపెద్ద చర్చీలను తలపించే రీతిలో ఇక్కడ పెద్ద భవనం కట్టించారు. దానిలో ఇప్పుడు బి.ఇడి కాలేజీ లేకపోగా నిరుపయోగంగా వుంది. అలాగే హిందూ విద్యార్థుల కోసం ఉద్దేశించి స్థాపించిన విద్యాసంస్థల ముందు తన రాజకీయపిచ్చితో అన్యమతాల విగ్రహాలు, ప్రార్ధనా మందిరం పెట్టించాడు. గతంలో దీనిపై బీజేపీ, హిందూ సంస్థలు పెద్ద ఎత్తున ఆందోళన చేయడం తెలిసిందే!

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం కాని, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కాని విఆర్ విద్యాసంస్థల జోలికి రాలేదు. అయితే విఆర్ విద్యాసంస్థలు కేంద్రంగా ఎన్నో వివాదాలు, ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు తెలుగుదేశం అధికారంలో వుంది. తెలుగుదేశం నాయకులు విఆర్ విద్యాసంస్థలపై కన్నేసి తమ ఆధిపత్యానికి గండి కొడతారేమోనని అనుమానించిన ఆనం సోదరులు... ఆ పరిస్థితి ఎదురుకాకముందే తెలుగుదేశంలో చేరిపోయారు. రాజకీయంగా తమకు ఇబ్బంది లేకుండా చూసుకున్నారు.

అయినా కూడా పూర్వవిద్యార్థుల కేసు వారిని వదల్లేదు. 1993లో క్రింది కోర్టు పూర్వవిద్యార్థుల కేసును కొట్టేసినా, విఆర్ పూర్వవిద్యార్థులైన ఆమంచర్ల శంకరనారాయణ, గూడూరు విజయరామిరెడ్డి, పోతూరు రమణయ్యలు హైకోర్టును ఆశ్రయించారు. 1996లో 126/96 నెంబర్ క్రింద హైకోర్టులో కేసు నమోదైంది. 2015లో ఈ కేసు కోర్టు ముందు విచారణ కొచ్చింది. రెండేళ్లుగా దీనిపై వాదనలు జరుగుతున్నాయి. వాదనలు ముగిసి ఈ నెల 6న హైకోర్టు తుది తీర్పును వెలువరిస్తూ ప్రస్తుతమున్న కమిటీని రద్దుచేసింది. ఏ విఆర్ విద్యాసంస్థల మీద ఆధిపత్యానికై ఆనం సోదరులు తెలుగుదేశంలో చేరారో ఆ లక్ష్యం నెరవేరకుండా పోయింది. వారి ఆధిపత్యానికి పూర్వవిద్యార్థులే గండి కొట్టారు. ఆనం సోదరులు ఒకటి తలిస్తే దైవం ఇంకొటి తలిచాడు. ఎట్టకేలకు విఆర్ విద్యాసంస్థలకు పట్టిన రాజకీయ గ్రహణం వీడినట్లయ్యింది.

# నెంబర్ గేమ్‌లో నెగ్గేదెవరు?

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల తేదీ దగ్గరపడే కొద్దీ నెల్లూరుజిల్లా స్థానిక శాసనమండలి ఎన్నిక వేడెక్కుతోంది. గెలుపు కోసం ఇరు పార్టీలు కూడా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. గెలుపే ధ్యేయంగా సర్వశక్తులు ఒడ్డుతున్నాయి.

రాష్ట్రంలో ఆరు స్థానికసంస్థల ఎన్నికలు ఏకగ్రీవం కాగా కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల స్థానిక ఎమ్మెల్సీలకు మాత్రం పోటీ నెలకొంది. మూడుజిల్లాలో వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి తమ పార్టీ తరపున అభ్యర్థులను రంగంలోకి దించారు. దీంతో ఈ మూడు జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల వేడి రగులుకుంది. ఈ మూడింటిలో కూడా ఇప్పుడు నెల్లూరుజిల్లా స్థానిక ఎమ్మెల్సీ అటు అధికార తెలుగుదేశంకు, ఇటు ప్రతిపక్ష వైకాపాకు ప్రతిష్టాత్మకంగా మారింది. నెల్లూరుజిల్లాలో వచ్చే ఫలితాలు భవిష్యత్ రాష్ట్ర రాజకీయ పరిణామాలకు సంకేతంగా నిలుస్తుంటాయి. కాబట్టే అటు చంద్రబాబు, ఇటు జగన్ నెల్లూరు స్థానిక ఎమ్మెల్సీపై ప్రత్యేకదృష్టి పెట్టారు. చంద్రబాబు, లోకేష్‌లైతే ప్రతిరోజూ తమ పార్టీ నాయకులతో మాట్లాడుతున్నారు. ఎమ్మెల్సీగా వాకాటిని గెలిపించి తీరాలని, గెలవకపోతే పరువుపోతుందని, గెలిపించలేకుంటే తాట తీస్తామంటూ జిల్లా నాయకులను హెచ్చరిస్తున్నారు. దీంతో మంత్రి నారాయణతో సహా జిల్లా తెలుగుదేశం నాయకులందరు కూడా ప్రలోభాలకు తెరలేపి తమ ఓటర్లను కాపాడుకోవడంతో పాటు వైసిపి ఓటర్లను డబ్బులిచ్చి ఎత్తుకొచ్చే పనిలో పడ్డారు.

ఇక వైకాపా వైపు చూస్తే స్థానిక ఎమ్మెల్సీలో ఓట్లు తక్కువగా వున్నప్పటికీ జగన్ ప్రోద్భలంతోనే అభ్యర్థిని పెట్టారు. నెల్లూరు ఎమ్మెల్సీని జగన్ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు. జిల్లాలోని వైకాపా నాయకులందరితోనూ ఆయన మాట్లాడుతున్నాడు. అవతల అధికారపార్టీ... పోలీసులను సైతం కార్యకర్తల మాదిరిగా వాడుకుంటోంది... స్థానిక ఓటర్ల మీద కేసులు పెట్టించి బలవంతంగా లొంగదీసుకుంటోంది. అయినప్పటికీ జిల్లా వైకాపా నాయకులు మాత్రం ఒక్క తాటిపై నిలబడ్డారు. తమ అభ్యర్థి కోసం శాయశక్తులా కష్టపడుతున్నారు.

కాకపోతే ఇది ప్రజలు ఓట్లు వేసే ఎన్నికలు కావు. చాలాతక్కువ మంది ఓటర్లుండే ఎన్నికలు... ఒకప్పుడు ప్రజలచేత ఓట్లేయించుకున్న వాళ్లే ఇక్కడ ఓటర్లు. సార్వత్రిక ఎన్నికల్లో అయితే ఓటు ఐదొందల నుండి రెండువేల దాకా పోతుంది. ఇక్కడ వేలల్లో కాదు... సొంత పార్టీ వాడికైతే రెండు లక్షలు, అవతల పార్టీ నుండి వస్తే ఐదులక్షలు. కాబట్టి పార్టీ లేదు, నీతి లేదు, సిద్ధాంతం లేదు. ఒకటి డబ్బు... రెండోది అధికారం. కాబట్టి ఈ విషయంలో అధికారపార్టీ వైపే కొంచెం మొగ్గు వుంటుంది.

ముఖ్యంగా దీనిని నెంబర్ గేమ్ అనవచ్చు. స్థానిక శాసనమండలి నియోజకవర్గంలో వైసిపి కంటే కూడా టీడీపీకే 152మంది సభ్యుల బలం అధికంగా వుంది. ఇప్పుడు కొంతమంది సభ్యులు అటు ఇటు మారి వున్నారు. మారిన సమీకరణాలను బట్టి తెలుగుదేశం శిబిరంలో ఈ స్కోర్ ఇంకా పెరిగి ఉండొచ్చు. వాస్తవంగా 2014లో స్థానిక ఎన్నికలు జరిగినప్పుడు ఈ జిల్లాలో అత్యధిక స్థానాలను వైకాపానే గెలుచుకుంది. వైసిపికి 438 మంది ఉండగా, టీడీపీకి 352మందే ఉండినారు. అయితే ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరగడం, తెలుగుదేశం అధికారంలోకి రావడంతో ఈ సంఖ్యలు మారిపోయాయి. జడ్పీ ఛైర్మెన్ ఎన్నిక సమయంలో కొందరు జడ్పీటీసీలు తెలుగుదేశంలో చేరారు. వీరితో పాటు కొందరు ఎంపీటీసీలూ చేరడం జరిగింది. అలాగే నెల్లూరు మేయర్ అజీజ్ వైసిపి నుండి టీడీపీలోకి దూకిన సమయంలోనూ కొందరు కార్పొరేటర్లు పార్టీ మారారు. ఆ తర్వాత అక్కడక్కడా ఎంపీటీసీలు వైసిపి నుండి టీడీపీలోకి జంప్ చేయడంతో స్థానిక శాసనమండలి ఓట్లలో అధికార పార్టీదే పైచేయి అయ్యింది.


పార్టీల పరంగా బలాబలాలు చూసినా, క్యాంపులలో వున్న సభ్యుల సంఖ్యను చూసినా నెల్లూరు స్థానిక ఎమ్మెల్సీపై వైకాపా ఏ మాత్రం ఆశలు పెట్టుకోనవసరం లేదు. కాకపోతే వారి ఆశల్లా కూడా స్థానిక ఓటర్లుగా వున్న ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు... తమ ఆత్మసాక్షిగా ఓటేస్తే గెలుస్తామనే నమ్మకం. తెలుగుదేశం గుర్తు మీద గెలిచిన వాళ్ళు తెలుగుదేశంకు, వై.యస్. బొమ్మతో గెలిచిన వాళ్ళు వైకాపాకు ఓటేస్తే ఇక్కడ వైకాపా అభ్యర్థిదే విజయం. తెలుగుదేశం అధికారపార్టీ కాబట్టి అక్కడ ఏదో జరుగుతుందని చాలామంది స్థానిక నాయకులు ఆ పార్టీలో చేరారు. అక్కడ చేరాక తెలిసింది వారికి... ఇక్కడకు రావడం దండగని. వై.యస్. బొమ్మ మీద గెలిచి, పార్టీ మారినవాళ్ళు, కనీసం తమ పొరపాటును సరిదిద్దుకోవడానికైనా ఈ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థికి మద్దతునిస్తారని ఆ పార్టీ నాయకులు నమ్ముతున్నారు. అలాగే అభ్యర్థుల పరంగా చూస్తే తెలుగుదేశం అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డి కంటే కూడా వైకాపా అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డి ఎన్నో విధాలా బెటర్! వాకాటి లాగా ఆయన బ్యాంకులకు వందలకోట్లు అప్పులేదు. తన గురించి గొప్పలు చెప్పుకోడు. వాకాటిలాగా ఎంపీటీసీలను జడ్పీటీసీలను చీప్‌గా చూడడు. సర్పంచ్, ఎంపీటీసీగా చేసిన నాయకుడు. కాబట్టి స్థానిక నేతల విలువ తెలిసిన మనిషి. అదీగాక ఆనం సోదరుల నలుగురిలోకల్లా మంచి పేరున్నది విజయకుమార్‌రెడ్డికే! కుట్ర రాజకీయాలు తెలియవు. ముక్కుసూటిగా మాట్లాడేతత్వం. నమ్మితే అవతల మనిషికి చాకిరీచేసే వ్యక్తిత్వం. పార్టీలను పక్కనపెట్టినా అభ్యర్థుల గుణగణాలను బట్టి ఓట్లేసినా విజయకుమార్‌రెడ్డిని విజయం వరించవచ్చు.

ఇక నెల్లూరు స్థానిక శాసనమండలిలో ఓటర్లను చూస్తే... పార్లమెంటు సభ్యులు ఇద్దరు, శాసనసభ్యులు 10 మంది, ఎమ్మెల్సీలు 3, జడ్పీటీసీలు 46 మంది, ఎంపీటీసీలు 585, కార్పొరేటర్లు 54, కౌన్సిలర్లు 144 మంది కలిపి మొత్తం 844మంది ఓటర్లు ఉన్నారు. తెలుగుదేశం క్యాంపులో 450మంది ఇప్పటికే ఉన్నట్లు సమాచారం. కాగా, వైసిపి క్యాంపులో 330మంది దాకా ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలిన వారు క్యాంపులకు పోకుండా బయటే తిరుగుతున్నారు.

మొత్తానికి జిల్లా రాజకీయాలలో టెన్షన్ వాతావరణమే వుంది. నెల్లూరుజిల్లా స్థానిక ఓటర్లయిన కార్పొరేటర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు భవిష్యత్ రాజకీయాన్ని నిర్దేశించే నిర్మాతలుగా మారారు. మరి వారి తీర్పు ఎలా వుండబోతుందో చూద్దాం!

## తిరగబెట్టిన ఓటు - నోటు

# చంద్రబాబుకు తప్పని తలపోటు



**తన సుందరస్వప్నం అమరావతి రాజధానిలో అందంగా కట్టుకున్న తాత్కాలిక శాసనసభ మందిరంలో అసెంబ్లీ సమావేశాలు ఆరంభించిన రోజే... రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబులోని ఆనందాన్ని ఆవిరి చేస్తూ సుప్రీంకోర్టు 'ఓటు - నోటు' కేసులో ఆయనకు నోటీసులు జారీ చేసింది. తనపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పుకోమంది. ఓటుకు-నోటు కేసులో చంద్రబాబు పాత్రపై పూర్తి స్థాయి విచారణ జరపాలంటూ మంగళగిరి ఎమ్మెల్యే ఆర్.కె.రామకృష్ణారెడ్డి వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించడం చంద్రబాబుకు షాకే!**

'ఓటు-నోటు' కేసు చంద్రబాబును నిను వీడను నీడను నేను అంటూ వెంటాడుతూనే వుంది. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేటెడ్ ఎమ్మెల్సీ స్టీఫెన్‌సన్ కొనుగోలుకు ప్రయత్నించి చంద్రబాబు అడ్డంగా బుక్ కావడం తెలిసిందే! టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోగా, స్టీఫెన్‌సన్‌తో ఫోన్‌లో సంభాషించడం ద్వారా చంద్రబాబు దొరికిపోయాడు. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపించుకోవడానికి చంద్రబాబు చేసిన ఈ ప్రయత్నం బెడిసికొట్టి రాజకీయంగా ఆయనకు, ఆర్థికంగా ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో నష్టాన్ని కలిగించింది. తెలంగాణ ఏసిబి ఈ కేసులో చంద్రబాబు పాత్రపై విచారించింది. తెలంగాణ సీఎం కేసీఆర్ చంద్రబాబుపై ఆగ్రహంతో వూగిపోయాడు. తెలంగాణ ఏసిబి అధికారులు వేగంగా దర్యాప్తు జరిపి సాక్ష్యాధారాలతో సహా కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసుంటే చంద్రబాబు సీఎం పదవి నుండి దిగిపోవాల్సివచ్చేది. కాని మధ్యలోనే కేంద్రం జోక్యం చేసుకుంది. కేసీఆర్, చంద్రబాబుల మధ్య రాజీ కుదిర్చారు. ఈ రాజీ ప్రకారం చంద్రబాబు మూటాముల్లె సర్దుకుని హైదరాబాద్ వదిలిపోవాలి. పెళ్ళిళ్ళకు, పేరంటాలకు తప్పితే రాజకీయంగా హైదరాబాద్ వైపు కన్నెత్తి చూడకూడదు. ఈ కండీషన్‌తోనే హైదరాబాద్‌లో మనకు పదేళ్ళు హక్కున్నప్పటికీ, కోట్లు ఖర్చుపెట్టి మరమ్మత్తులు చేసిన భవనాలను వదులుకుని చంద్రబాబు విజయవాడకు మకాం మార్చారు. ఇచ్చిన మాట ప్రకారం కేసీఆర్ కూడా ఓటుకు నోటు కేసును నీరుగార్చే ప్రయత్నం చేసాడు. ఏసిబి కూడా ఈ కేసు దర్యాప్తును పక్కనపెట్టింది. చంద్రబాబు మళ్ళీ ఎక్కడన్నా హైదరాబాద్ పేరెత్తితే ఈ అస్త్రాన్ని బయటకు తీసి భయపెట్టడానికి కేసీఆర్ తన వద్ద జాగ్రత్తగా పెట్టుకున్నాడు.

వాస్తవానికి ఇది వాళ్ళిద్దరి మధ్య కేసు. వాళ్ళిద్దరి మధ్యే సమిసిపోతుందనుకున్నారు. కాని మంగళగిరి ఎమ్మెల్యే ఆర్.కె. రామకృష్ణారెడ్డి రూపంలో చంద్రబాబుకు ముప్పు ఎదురుకాసాగింది. కేసీఆర్-చంద్రబాబుల మధ్య రాజీతో ఈ కేసు ఇక ముగిసిపోతుందని భావించిన ఆయన ఈ కేసులో చంద్రబాబు పాత్రపై దర్యాప్తు జరపాలంటూ ఏసిబి కోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారించిన ఏసిబి కోర్టు ఈ కేసుపై విచారణ జరపాలని ఏసిబిని ఆదేశించింది. ఏసిబి కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ చంద్రబాబు హైకోర్టును ఆశ్రయించాడు. చంద్రబాబు అప్పీల్‌పై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి తాళ్ళూరి సునీల్‌చౌదరి ఏసిబి కోర్టు ఉత్తర్వులను నిలిపివేస్తూ స్టే ఇచ్చారు. అంతేకాక ఆళ్ళ రామకృష్ణారెడ్డి పిటిషన్‌ను కొట్టివేస్తూ, ఈ కేసులో జోక్యం చేసుకునే అర్హత పిటిషనర్‌కు లేదని తేల్చి చెప్పారు. అంతే కాక చంద్రబాబు స్టీఫెన్‌సన్‌కు లంచం ఇవ్వలేదని తేల్చేసారు.

హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రామకృష్ణారెడ్డి సుప్రీంను ఆశ్రయించారు. సుప్రీం ఇప్పుడు ఈ కేసులో చంద్రబాబు పాత్రపై దర్యాప్తుకు ఆదేశించింది. నా మీద 26కేసులు పెట్టారు... ఏమీ కాలేదు, ఈ కేసు కూడా అంతే అని చంద్రబాబు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. కాని తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ కొనుగోలుకు ప్రయత్నించడం, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి స్వయంగా వెళ్ళి ఆయనకు డబ్బులివ్వడం, స్టీఫెన్‌సన్‌తో అంతా మావాళ్ళు చూసుకుంటారని చంద్రబాబు మాట్లాడడం.. అన్నీ నిజాలే! సజీవ సాక్షాలే! ఆ టేపుల్లో వున్నది తన గొంతు కాదని చంద్రబాబు కూడా ఇంతవరకు చెప్పలేదు. ఓటు కోసం కోట్లు ఇవ్వడం నేరమైతే ఈ కేసులో చంద్రబాబు ముద్దాయే! ఆయన తరపు లాయర్ వాదిస్తున్నట్లు ఓటుకు డబ్బివ్వడం నేరం కాకపోతే ఈ కేసులో ఆయనను నిందితుడిగా చేర్చడం కూడా అనవసరమే!

ఏదేమైనా ఓటు-నోటు ఆటను కేసీఆర్ మొదలుపెట్టాడు. తనకు కావాల్సింది దొరకడంతో ఆయన మిడిల్‌డ్రాప్ అయ్యాడు. ఆయన వెలిగించిన 'ఓటు-నోటు' క్రీడా జ్యోతిని మధ్యలో రామకృష్ణారెడ్డి అందుకుని పరుగెడుతున్నాడు. ఇక కథ క్లైమాక్స్ కొచ్చింది. సుప్రీం కోర్టు ఏ విధంగా ఫినిషింగ్ టచ్ ఇస్తుందో చూద్దాం.

# ఫలించిన కోటంరెడ్డి పోరాటం

- శ్రీధర్‌రెడ్డి లేఖకు స్పందించిన కేంద్రమంత్రి
- ఎట్టకేలకు సర్వీస్‌రోడ్లకు మోక్షం



శ్రీధర్‌రెడ్డి కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీకి, ఈ విషయంలో తనకు సహకారం అందించిన యం.వెంకయ్యానాయుడుకు తన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల సాధనకు నెల్లూరు రూరల్‌ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేస్తున్న కృషి సత్ఫలితాలనిస్తూ ప్రజల ప్రశంసలకు పాత్రమవుతోంది. అభివృద్ధిలో వెనుకబడివున్న నెల్లూరు గ్రామీణ నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో ముందంజ వేసేందుకు శ్రీధర్‌రెడ్డి చేస్తున్న అలుపెరుగని పోరాటం అందరికీ తెలిసిందే. ఒక్క మాటలో చెప్పాలంటే 'ఎక్కడ సమస్య వుంటే అక్కడ శ్రీధరన్న వుంటాడు, ఆ సమస్యలు తీరుస్తాడన్న' ప్రఖ్యాతి ఆయనకు రావడం విశేషం. ఇటీవల సర్వీస్‌రోడ్ల నిర్మాణ విషయంలో శ్రీధర్‌రెడ్డి చేస్తున్న పోరాటానికి కేంద్రం దిగివచ్చింది. ఈ రోడ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతుండడాన్ని ఆయన ఇటీవల సీరియస్‌గా తీసుకున్నారు. రోడ్ల నిర్మాణం వెంటనే జరగకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఆ తర్వాత ఆ విషయమై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఓ లేఖ కూడా రాశారు. అందుకు స్పందించిన నితిన్‌గడ్కరీ, బుజబుజనెల్లూరు సర్వీస్ రోడ్డు, కనుపర్తిపాడు జంక్షన్, బుజబుజ నెల్లూరు జంక్షన్, సుందరయ్య కాలనీ, పడారుపల్లి జంక్షన్‌ల వద్ద సర్వీస్‌రోడ్డు, అండర్‌బ్రిడ్జిలు నిర్మించాలంటూ సంబంధిత చీఫ్ ఇంజనీర్‌కు ఆదేశాలు జారీ చేశారు. తన లేఖకు స్పందించినందుకు ఈ సందర్భంగా కోటంరెడ్డి


## కరువైన చుక్కాని...

# కలవరంలో 'కాకాణి'



నెల్లూరుజిల్లా రాజకీయ రంగమే ఓ సంచలనమైనది. ఎంతోమంది మేధావులు నెల్లూరుజిల్లా నుంచి దేశ రాజధాని ఢిల్లీ దాకా తమ ప్రాభవాన్ని చాటుకుని తమదైన తరహాలో చక్రం తిప్పి చరిత్ర సృష్టించారు. అలాంటి నెల్లూరుజిల్లా రాజకీయ రంగానికే తలవంపులు తెచ్చి చరిత్రలో చెరిగిపోని మచ్చను తెచ్చిన వ్యక్తిగా సర్వేపల్లి శాసనసభ్యుడు కాకాణి గోవర్ధనరెడ్డి మిగిలిపోయాడు. జిల్లా పరిషత్ ఛైర్మెన్‌గా అపార ప్రజాభిమానాన్ని పొంది, సర్వేపల్లి శాసనసభ్యుడిగా తన సత్తా చాటుకుని రాష్ట్రస్థాయి నాయకుడిగా తమ నాయకుడు ఎదుగుతాడనుకున్న ఆయన అనుచరుల అంచనాలు తారుమారు చేస్తూ ప్రపంచస్థాయిలో అభాసుపాలై చెరిగిపోని అపకీర్తిని మూటగట్టుకున్న వ్యక్తిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి చరిత్రకెక్కాడు. దూకుడుతనంతో అత్యుత్సాహంతో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై ఆయన చేసిన ఆరోపణలను చూసిన హైకోర్టు సైతం నివ్వెరపోయి పదేపదే ఆయనకు బెయిలు తిరస్కరిస్తూ జైలుకి పంపమని ఆదేశించడం చూస్తే, కాకాణి రాజకీయ భవిష్యత్తు చుక్కాని లేని నావలా తయారైనట్లనిపిస్తోంది.

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సైతం జిల్లా అధ్యక్షుడిగా ఆయనను వుంచాలా లేదా వూడబీకాలా అని ఆలోచించుకునే స్థాయికి ఆయన పరిస్థితి దిగజారిపోయింది. ఆ గోవర్ధనగిరిని శ్రీకృష్ణుడు చిటికెన వేలితో పైకెత్తి ఆదర్శమూర్తిగా అవతారమెత్తితే.. ఈ గోవర్ధన 'గిరి' తన వేలితో తన భవిష్యత్తునే చెరిపేసుకుని చరిత్రహీనుడిగా మిగిలిపోనున్నాడు. ఇలాంటి సంఘటన నెల్లూరుజిల్లా రాజకీయాల్లో బహుశా ఇదే ప్రథమం..అంతిమం కూడా అవుతుందేమో?...



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com